J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 43 సంచిక : 44 05.04.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## టీడీపీ - జనసేనలకి
# మోడీతో జోడీ కలిసొచ్చేనా?



### ప్రధాని సభ వారికి మేలు చేసిందా? కీడు చేసిందా??
### 'సిద్ధం', 'మేమంతా సిద్ధం' సభలు ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి???

***ఆం**ధ్రప్రదేశ్‌లో ఎలాగైనా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న ప్రతిపక్షాల ప్రయత్నాలు ఫలిస్తాయా? బీజేపీ - టీడీపీ - జనసేన కలయికతో 2014 ఫలితాలు పునరావృతమవుతాయా? కూటమితో జతకట్టిన తరువాత ఆంధ్రాలో జరిగిన మోడీ సభ టీడీపీ - జనసేనల బలం పెంచిందా... తగ్గించిందా...? 'సిద్ధం' సభల తరువాత 'మేమంతా సిద్ధం' అంటూ బస్సు యాత్ర చేస్తున్న జగన్ పర్యటనల ప్రభావం ఎంత...? గ్రామాల నుండి నగరాల దాకా ప్రస్తుతం ఆంధ్రాలో వినిపిస్తున్న ప్రశ్నలు ఇవే...! అటు రాజకీయవర్గాల్లోనూ, పార్టీ శ్రేణుల్లోనూ ఇలాంటి అనుమానాలే వ్యక్తమవుతున్నాయి.*

**ఢి**ల్లీ పీఠాన్ని మళ్ళీ నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీయే దక్కించుకోబోతోందన్న మాట సర్వత్రా వినిపిస్తోంది. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్న ఆసక్తి, ఉత్కంఠ ఇటు ఆంధ్రాలోనే కాకుండా భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రాంతీయపార్టీల నేతలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజంలో కూడా కనిపిస్తోంది.

### మోడీ ఏం చెప్తే.. అది చేశారు!

గడచిన పది సంవత్సరాలలో నరేంద్ర మోడీ ఏం చెప్తే అది అధికశాతం భారతీయులు అమలుచేశారు. మోడీ చప్పట్లు కొట్టమంటే కొట్టారు, లైట్లు ఆర్పమంటే ఆర్పేశారు. వీధులలోకి వచ్చి దీపాలు పెట్టమంటే పెట్టారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో దేశ ప్రజలని ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడతారు అని ప్రకటన వస్తే.. దేశ ప్రజలంతా టీవీల ముందు ఆసక్తిగా కూర్చునేవారు. అస్సలు భారతీయ జనతా పార్టీ ఊసే లేదనుకునే రాష్ట్రాల్లోని ప్రజలు సైతం, మా దేశానికి దశ దిశ చూపే దమ్మున్న నాయకుడు నరేంద్ర మోడీయే అనుకునేంతగా ప్రజలని ప్రభావితం చేసిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోడీ.

### జోడీ కలిసొస్తుందా?

అలాంటి నరేంద్ర మోడీతో జతకట్టిన టీడీపీ – జనసేనల ఆశ ఫలిస్తుందా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రాష్ట్రంలో ఉన్న రెండు ప్రాంతీయపార్టీలతో చరిష్మా ఉన్న జాతీయ పార్టీ కలిస్తే ఖచ్చితంగా మంచి ఫలితమే వస్తుందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. హిందుత్వ

14లో




## • అధికారుల తీరుపై అసహనం
# 'అయ్యా యస్'లకి స్థానచలనం
### కొరడా ఝుళిపించిన ఎన్నికల సంఘం

**సా**ర్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపిస్తోంది. అధికారుల తీరును సునిశితంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా, అఖిలభారత సర్వీసు అధికారుల పనితీరుపై మరింత దృష్టిపెట్టి, పలుచోట్ల వారిపై వస్తున్న అరోపణలను విచారించి, అవి నిజమని తేలిన వారిని ఎన్నికల విధుల్లోంచి పక్కనపెడుతోంది. ఇప్పటిదాకా వారు ఉన్న స్థానాల్లోంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసేస్తోంది. ఈ నేపథ్యంలో, ఈనెల 2వ తేదీ ముగ్గురు ఐఏఎస్‌లు, ఆరుగురు ఐపిఎస్‌లు మొత్తం కలపి 9 మంది ఉన్నతాధికారులపై ఒకేరోజు, ఒకే ఉత్తర్వుతో బదిలీ వేటు వేయడం అధికారుల్లోనే కాక, రాజకీయవర్గాల్లో కూడా సంచలనం రేపుతోంది. వారంతా ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కూడా స్పష్టంగా ఆదేశించింది. ఎన్నికల కమిషన్ నేరుగా ఈ స్థాయిలో చర్యలు తీసుకోవడం బహుశా ఇదే ప్రథమమని అంటున్నారు. వీరంతా అధికారపార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలే ప్రధానంగా ఈ బదిలీలకు కారణమని తెలుస్తోంది.

బదిలీలకు గురైన వారిలో కృష్ణా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పి. రాజబాబు, అనంతపురం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశాలు ఉన్నారు. అదేవిధంగా, పల్నాడుజిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, చిత్తూరుజిల్లా ఎస్పీ పి.జాషువా, అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్, నెల్లూరుజిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిలతో పాటు గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజును కూడా ఎన్నికల కమిషన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ చర్యలతో అధికారులెంతటి

14లో



## తెలుగుదేశం పార్టీకి ఓటేస్తే..
# సంక్షేమ పథకాలు ఉండవు
### ఆదాల ప్రభాకర్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఉండవని, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇప్పుడు అందుతున్న పథకాలు కనుమరుగవుతాయని, రానున్న ఎన్నికల్లో ప్రజలు పొరపాటున కూడా తెలుగుదేశం పార్టీకి ఓటేయవద్దని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మార్చి 30న ఆయన రూరల్ నియోజకవర్గంలోని 32వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్ నియోజకవర్గంలో రౌడీలు, భూకబ్జాదారులు, అవినీతిపరులు, నమ్మకద్రోహులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వవద్దన్నారు. నిత్యం ప్రజలతోనే ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేవారికే ఓటేయాలన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే, రానున్న అయిదేళ్ళలో రూరల్‌ను నెంబర్-1గా అభివృద్ధి చేస్తానన్నారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

# టీడీపీకి.. విష్ణువర్ధన్‌రెడ్డి రాజీనామా
### • వైకాపాలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే



మాజీ శాసనసభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల అల్లూరులోని తన నివాసంలో ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలను కోరగా, 'మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మేం మీతోనే ఉంటామని' వారు చెప్పడంతో, విష్ణువర్ధన్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఇమడలేక ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గత ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలుపొందిన టీడీపీ నాయకుడు దిలీప్ కూడా విష్ణువర్ధన్‌రెడ్డికి మద్దతుగా విష్ణు సమక్షంలో టీడీపీకి రాజీనామా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోసల గోపాల్‌రెడ్డి, వాసిపల్లి పద్మనాభరెడ్డి, అనుమాలశెట్టి శివ, దువ్వూరు శరత్ చంద్రారెడ్డి, బాలకృష్ణమరాజుతో పాటు కావలి నియోజకవర్గంలోని అనేకమంది అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి వైకాపాను ఓడించండి
### బీజేపీ నాయకుల పిలుపు



అవినీతి వైకాపాను రానున్న ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల వెంకటాచలంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా బీజేపీ అధికారప్రతినిధి వేల్పాళెం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి నిధులు విడుదల చేస్తున్నా, అవన్నీ తామే చేస్తున్నట్లుగా వైకాపా ప్రభుత్వం చెప్పుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ధరలు పెరిగిపోయాయని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, కరెంటు బిల్లులు, పన్నుల భారం పెంచి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను నానా కష్టాలకు గురిచేస్తోందని ఆయన దుయ్యబట్టారు. బీజేపీ కార్యకర్తలు కేంద్రం ప్రజల కోసం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షులు కుంచె శ్రీనివాసయాదవ్, నాయకులు అల్లూరు ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.





# వైకాపా పాలనకు చరమగీతం పాడాలి
### • టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల కావలి, వింజమూరులలో పెద్దఎత్తున జరిగిన ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అవినీతికి అడ్డే లేకుండా పోయిందని, అవినీతిపరుడైన ప్రతాప్‌ను ఓడించి, టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిని ప్రజలు గెలిపించుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, టీడీపీ ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)ని, ఉదయగిరిలో కాకర్ల సురేష్‌ను గెలిపించాలని ఆయన కోరారు. విపిఆర్ అజాతశత్రువని, ప్రజలకు సేవ చేయాలని ఆయన రాజకీయాల్లోకి వచ్చారని, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి మంచి గుర్తింపు తెచ్చే వ్యక్తి అని అంటూ, అలాంటి వ్యక్తి టీడీపీలో చేరినందుకు గర్వపడుతున్నానని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా వైకాపాపై, జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు ధ్వజమెత్తారు. విజయసాయిరెడ్డి అత్యంత అవినీతిపరుడని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జగన్‌కు నమ్మకం లేదని, అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో వైకాపా ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. ప్రజల కోసమే బీజేపీ, జనసేనలతో పొత్తు పెట్టుకున్నామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం, రాష్ట్ర ప్రగతి కోసం చేపట్టదలచిన కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. జిల్లాలో టీడీపీ అభ్యర్థుల గెలుపుకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం, వింజమూరులో ముఖ్యనేతలతో కలిసి టీడీపీ విజయానికి అందరూ కృషిచేయాలని నాయకులను కోరారు.

## బీజేపీ నాయకులతో..
# 'ఆనం' భేటీ



ఆత్మకూరులోని బీజేపీ నాయకులతో మాజీమంత్రి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఏప్రిల్ 1న భేటీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని ఆయన బీజేపీ నాయకులను కోరారు. అందుకు వారు స్పందిస్తూ, ఆనంకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనం గెలుపు కోసం ప్రచారం ముమ్మరం చేస్తామని చెప్పారు. తొలుత, ఆనం బీజేపీ కార్యాలయం వద్దకు రాగానే బీజేపీ నాయకులు కె.మల్లికార్జున రెడ్డి, కుడుమల సుధాకర్‌రెడ్డి తదితరులు సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దావా పెంచలరావు, తుమ్మల చంద్రారెడ్డి, కాటంరెడ్డి రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'దేశం'లో చేరిన బిజివేముల

మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మేనల్లుడు బిజివేముల సురేంద్రరెడ్డి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరులో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ పుట్టం బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచకపాలన
### టీడీపీ నేతల ధ్వజం



రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైకాపాకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని టీడీపీ నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఇటీవల తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రూప్ కుమార్‌యాదవ్, రాజానాయుడు తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందేందుకు పార్టీ వ్యవస్థాపకులైన నందమూరి తారక రామారావు చేసిన కృషి అపూర్వమని వారు ప్రస్తుతించారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ఎన్టీఆర్ ఆశయాల బాటలో అందరూ నడిచి పార్టీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. తొలుత, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ధర్మవరం సుబ్బారావు, మహిళా నాయకురాలు పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ గెలిస్తే.. రూ.4 వేల పెన్షన్
### కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తే, పెన్షన్‌దారులకు ప్రతి నెలా 4వేల రూపాయల పెన్షన్, వారి ఇళ్ళవద్దకే వచ్చి అందిస్తామని, ఆమేరకు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని కావలి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి చెప్పారు. ఏప్రిల్ 1న ఆయన కావలిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ చేస్తున్న స్వార్థ రాజకీయాలతో పెన్షన్‌దారులు కష్టాలు పడుతున్నారని ఆరోపించారు. ఖజానాలో నిధులు లేకపోవడం వల్లే పింఛను ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ, వైకాపా కార్యక్రమాల్లో పాల్గొనకుండా, ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# అత్యున్నత పురస్కారం!.. మహోన్నత సత్కారం!

## అడ్వాణీ ఇంటికి వెళ్లి 'భారతరత్న'ను బహుకరించిన రాష్ట్రపతి

***దేశంలోని అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'ను అందుకోవడానికి వయోభారం, అనారోగ్యం వల్ల స్వయంగా వెళ్ళలేకపోయినా, నేరుగా భారత రాష్ట్రపతే ఆయన ఇంటికి వెళ్ళి మరీ ఆ విశిష్టమైన పురస్కారాన్ని అందజేసి తన ఔన్నత్యాన్ని చాటుకోవడం ప్రజల మనసులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి బీజేపీ అగ్రనేత అడ్వాణీ వయోభారం కారణంగా వెళ్ళలేకపోయారు. దీంతో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా ఆయన నివాసానికి వెళ్ళి 'భారతరత్న'ను బహుకరించి అందరి ప్రశంసలందుకున్నారు. సాక్షాత్తూ రాష్ట్రపతే స్వయంగా ఆయన ఇంటికి వెళ్ళి ఆ పురస్కారాన్ని అందజేయడం భారతీయుల సంస్కారానికి నిదర్శనమంటూ ప్రజలు సంతోషం వెలిబుచ్చుతున్నారు.***

దేశ అభ్యున్నతికి, పురోగమనానికి అడ్వాణీ చేసిన సేవలకు గుర్తింపుగా భారత రత్న' పురస్కారం ప్రదానం చేయడం జరిగిందని రాష్ట్రపతి ఈ సందర్భంగా అడ్వాణీని ప్రశంసించారు. తన గురువైన అడ్వాణీజీకి దేశంలోని అత్యున్నత పురస్కారం 'భారతరత్న'ను ప్రదానం చేయడం పట్ల పూర్వ ఉప రాష్ట్రపతి.. మన నెల్లూరీయులు వెంకయ్యనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఆ వేడుకలో తాను కూడా పాల్గొనడం తనకెంతో గౌరవప్రదమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ప్రధాని నరేంద్రమోడీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోమ్‌మంత్రి అమిత్‌షా తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీకే...
### గౌరవం తెచ్చిన అడ్వాణీ

భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా, పార్టీ సీనియర్‌మోస్ట్ లీడర్‌గా అడ్వాణీకి బీజేపీలో అగ్రస్థానం ఉన్న విషయం అందరికీ తెలిసిందే. 1990 ప్రాంతాల్లో అయోధ్య రామాలయం కోసం అడ్వాణీ చేసిన రథయాత్ర దేశంలోనే సంచలనం కలిగించింది. ఆ రథయాత్రే బీజేపీని జాతీయ రాజకీయాల్లో ఉన్నతమైన స్థానానికి తీసుకువెళ్ళింది. మరో అగ్రనేత వాజ్‌పేయితో కలసి 1980లో భారతీయ జనతా పార్టీని స్థాపించారు. మూడుసార్లు బీజేపీ అధ్యక్షునిగా ఆ పార్టీకి ఎనలేని సేవలందించారు. 1998లో గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన అడ్వాణీ, బీజేపీ ప్రభుత్వంలో రెండుసార్లు కేంద్ర హోంమంత్రిగా పనిచేయడమే కాక, 2002లో ఉప ప్రధాని పదవిని కూడా అధిష్టించారు. చిన్నతనంలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి, అంచలంచెలుగా ఎదుగుతూ బీజేపీలో ఉన్నతస్థానం పొందడమే కాక, తన విశేషమైన పట్టుదల-కార్యదీక్షలతో బీజేపీకే అత్యున్నత గౌరవాన్ని తెచ్చారు.



### తెలుగుబిడ్డ పీవీకి.. భారతరత్న

మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, మన తెలుగుబిడ్డ..దివంగత నేత పీవీ నరసింహారావుకు ప్రకటించిన 'భారత రత్న' పురస్కారాన్ని, మార్చి 30న ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించారు. అదే విధంగా, మరో మాజీప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌లకు కూడా మరణానంతరం ప్రకటించిన ఆ పురస్కారాలను వారి కుటుంబసభ్యులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకున్నారు.

### వైకాపా అరాచక పాలనకు
# గుణపాఠం చెప్పాలి
### కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



వైసీపీ ఆరాచక పాలనకు విసుగెత్తిన కోవూరు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి టీడీపీలో చేరుతున్నారని ఈ పరిణామం ప్రజల్లో వస్తున్న మార్పుకు సంకేతమని కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుధవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట ప్రయోజనాలే టీడీపీ, జనసేన, బిజెపి కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. నిబద్ధతతో సంక్షేమ పథకాలు అమలుచేయడమే కాదు ఆయా పథకాలు అమలు చేసేందుకు కావాల్సిన సంపద సృష్టించడం కూడా ఎన్డీఏ కూటమి లక్ష్యమన్నారు. రాష్టంలో దళితులపై జరుగుతున్న దాడులపై ఈ సందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత అయిదేళ్లలో దళితులపై 6 వేల కేసులు పెట్టి వేధించిన వైకాపాకు బుద్ధి చెప్పేందుకు దళితులందరు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికలలో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించి అధికార పార్టీ ఆరాచకాలకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి 160 సీట్లు గెలవబోతోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్టాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలజీతాల్లో జరుగుతున్న జాప్యం ఉండబోదని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు సకాలంలో చెల్లించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఏటా 15,000 చెల్లించే బాధ్యత తీసుకుంటామని వెల్లడించారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏడాదికి 20వేల రూపాయలు, దీపం పథకం ద్వారా ప్రతి గృహిణికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందచేస్తామన్నారు. 18 నుండి 59 సంవత్సరాల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు 15 వేల రూపాయలు ఇచ్చి ఆదుకుంటామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత 50ఏళ్లు పైబడ్డ బీసీలకు 4వేల రూపాయలు పెన్షన్ యివ్వడమే కాకుండా, ప్రస్తుతం ఇస్తున్న వృధ్యాప్య పెన్షన్‌ను కూడా 3వేల నుంచి 4వేల రూపాయలకు పెంచుతామన్నారు. రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం వైకాపాపై టిడిపి కూటమి చేస్తున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.


ఆచార్యదేవోభవ...!



క్రమశిక్షణలో, ఉత్తమ శిక్షణలో, సమయపాలనలో
తనకు తానే సాటిగా.. అత్యుత్తమ బోధనలో మేటిగా
వేలాదిమంది డాక్టర్లని, ఇంజనీర్లని, విద్యావంతులని
తీర్చిదిద్దిన పూజ్యులు, మా ఆచార్య దేవులు
రత్నం మాస్టారు గారి
పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

డాక్టర్ రజనీకాంత్ పేచ్చా వెంకట
సీనియర్ సర్జన్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్
గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్, చెన్నై.

డాక్టర్ నీరజ పేచ్చా, MRCPCH
సీనియర్ పీడియాట్రీషన్ & నియోనెటాలజిస్ట్
రైన్‌బో హాస్పిటల్స్, అన్నానగర్, చెన్నై.

లాయర్
ఏప్రిల్ 05, 2024

# పెరుగుతున్న జనాభా..పట్టణాలకో పెద్ద సమస్య!

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో పట్టణీకరణ అనివార్యమైనప్పటికీ, రానురాను అదొక పెద్ద సమస్యగా తయారవుతోంది. ఈ విషయం పట్ల అలక్ష్యంగా ఉంటే రానున్న రోజుల్లో అది మరింత జటిలంగా మారే ప్రమాదం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. పట్టణాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, విద్య-వైద్య సౌకర్యాలు, ఆధునిక సదుపాయాలు వంటివి పుష్కలంగా ఉండడం ముఖ్యంగా పట్టణీకరణకు లేదా నగరీకరణకు ప్రధాన కారణాలు. దాంతోపాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పట్టణాలకు వచ్చి స్థిరపడుతుండడం వల్ల కూడా పట్టణాల జనాభా విపరీతంగా పెరిగిపోవడానికి ఒక కారణంగా ఉంటోందని నిపుణులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా గుట్టలుగుట్టలుగా పెరిగిపోతున్న నేటి కాలంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో అధికజనాభా గల భారత్ వంటి దేశాలు ప్రజలకు అవసరమైన వసతులు కల్పించడానికి నానా బాధలు పడాల్సివస్తుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మరో వందేళ్ళలో మనదేశ జనాభా మరింతగా పెరిగిపోవడమే కాక, నగర జనాభాల్లో ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు ప్రపంచ నగరాల్లోనే అగ్రభాగాన నిలిచే పరిస్థితి ఉందని కూడా అంటున్నారు. అందులోనూ, వ్యవసాయమే ప్రధానంగా ఉన్న మనదేశంలో..గ్రామాల్లో సేద్యం, చేతివృత్తుల వంటివి క్రమేణా కష్టాలమయంగా తయారవడంతో పేద, మధ్యతరగతి రైతు కుటుంబాల వారు ఉపాధి కోసం ఎక్కువగా పట్టణాల వైపు చూస్తున్నారు. ఉన్నత విద్యల కోసం పట్టణాలకు, లేదా నగరాలకు వెళ్లక తప్పని కుటుంబాలు ఇంకొన్ని. గ్రామీణ యువత కూడా అధికభాగం ఆధునిక వసతులున్న పట్టణాలకు వెళ్ళడానికే ఇష్టపడుతున్నారు. మరోవైపు కూలిపనులు కూడా దొరక్క అవస్థలు పడుతున్న నిరుపేద కుటుంబాల వారు కూడా తట్టాబుట్టాతో పాటు కడుపు చేతపట్టుకుని, ఏదోఒక పని చేసుకుని బతుకుదామనే ఆశతో పట్టణాలకు పోతున్నారు. దీంతో పల్లె జనాభా తగ్గడం, పట్టణ జనాభా పెరగడం కూడా తప్పనిసరి అవుతోంది. పట్టణాలకు వచ్చే జనానికి తగ్గ వసతులు కల్పించలేక పట్టణాల్లోని పాలకులు లేదా అధికార గణం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చేస్తోంది. ముఖ్యంగా దేశంలోని అనేక పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే కోట్లాదిమంది పేదజనం నివసించే ప్రాంతాలు మురికివాడలుగా మారి ఎంతో దయనీయంగా, దుర్భరంగా ఉంటున్నాయి. నేటికీ మంచినీటి వసతులు, పారిశుద్యం వంటి మౌలిక సదుపాయాలు కూడా కరువై, కాలుష్యం భయంకరంగా పెరిగిపోయి నిత్యం వేలాది మంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదే అదనుగా పట్టణాల్లో భూముల ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. ఏదైనా అద్దె ఇంట్లో ఉండి ఉపాధి చూసుకుందామనుకునేవారికీ చుక్కలు కనిపిస్తున్నాయి. నగరాల్లో అద్దెఇంటి కోసం రోజుల తరబడి కాళ్ళరిగేట్లు తిరిగినా ఇల్లు కల్లగా మారుతోంది. ఇలాంటి కష్టాలను అధిగమించి ఉన్నతస్థాయికి చేరుతున్నవారి సంఖ్య తక్కువే అనవచ్చు. ఈ నేపథ్యంలో నిరుపేదల గోడు మరింత దయనీయం. పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు తరలివచ్చిన వేలాదిమంది కూలీలు, కార్మికులకు సరైన జీవనభృతి కరువవుతోంది. కొద్దోగొప్పో చదువుకున్నవారు కూడా కుటుంబ పోషణకు కూలిపనులు చేసుకోవాల్సిన దుర్గతి మరింత హృదయవిదారకంగా ఉంటోంది. ఈ అవస్తలు చాలవన్నట్లు, కొన్నిప్రాంతాల్లో పల్లెల నుంచి పట్టణాలకు వచ్చిన యువత తమ గ్రామీణ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి నగరాల్లోని పాశ్చాత్త ధోరణులకు అలవాటుపడి, పెడదారి పడుతుండడం విచారకరం.

ఏదేమైనా.. అది పల్లెయినా, పట్టణమైనా, నగరమైనా ప్రతిఒక్కరికీ జీవనోపాధి కల్పించడం, మనిషి బతుకు జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగించడం పాలకుల, ప్రభుత్వాల కనీసధర్మం. ప్రపంచంలోనే జనాభాలో నెంబర్-1గా ఉన్న మనదేశంలో..పుష్కలంగా ఉన్న శ్రమశక్తిని, మానవవనరులను సద్వినియోగం చేసుకోగలిగితే అభివృద్ధిలోనూ మనకిక తిరుగులేదని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్రప్రభుత్వంతో పాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా ఇకనైనా ఆ దిశలో ఆలోచించి పట్టణీకరణ సమస్యలపై దృష్టిపెట్టి, దేశం ప్రగతిపథంలో సాగేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. పట్టణాలకు-నగరాలకు ఉపాధి కోసం వచ్చిన వారి స్థితిగతులను పరిశీలించి, సమస్యలను తీర్చగలిగితే.. దేశంలో ఆర్థిక ఉత్పాదకశక్తి బాగా పెరుగుతుంది. ఏదేమైనా, అసలే అధికజనాభాతో సతమతమవుతున్న మనదేశంలో, పట్టణీకరణ-నగరీకరణల వల్ల ఇప్పుడే కాదు.. భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు లేకుండా ముందుచూపుతో.. ప్రభుత్వాలు తగు ప్రణాళికలను అమలుచేయాల్సి ఉంది.

## ములుముడి వంతెనను బాగుచేయండి!

నెల్లూరు రూరల్ మండలంలోని ములుముడి గ్రామంలో పంటకాలువపై ఉన్న వంతెన గత కొద్దికాలంగా శిథిలావస్తలో ఉంది. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటున్న ఈ దారిలో ఉన్న వంతెనను వాహనాలు ఢీకొనడంతో దాని గోడలు పడిపోయాయి. ఈ వంతెన మీదుగానే పంటపొలాలకు రైతులు వాహనాల మీద వెళ్తుంటారు. ఇది ప్రమాదకరంగా తయారైవుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏ పెద్ద ప్రమాదం జరగక ముందే, సంబంధిత అధికారులు ఓసారి దీనిని పరిశీలించి బాగుచేయాలని విజ్ఞప్తి.

ఎస్ఎన్ సుధాకర్, నెల్లూరు రూరల్.

## అటు ఎండలు..ఇటు దొంగలు

జిల్లాలో ఒకవైపు ఎండలు మండిపోతుంటే, మరోవైపు దొంగలు పెట్రేగిపోతున్నారు. ఎండాకాలంలో ఉక్కపోతతో ఇళ్ళల్లో పడుకోలేక, ఆరుబయట పడుకుంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్ళకు తాళం వేసి ఎక్కడికన్నా వెళితే, వచ్చేలోగానే తలుపుల తాళాలు పగలగొట్టి దోచుకుపోతున్నారు. తాళాలు వేసివున్న ఇళ్లను ముందుగానే గమనించి, గ్రిల్స్ వేసివున్నా, వాటి తాళాలను కూడా పగలగొట్టేస్తున్నారు. జిల్లాలో ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట దొంగతనాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదంగా ఉంటోంది. ఇళ్ళు, దేవాలయాలు, దుకాణాలు..ఎక్కడ వీలుంటే అక్కడంతా దొంగతనాలు చేస్తున్నారు. ఈ చోరీల పట్ల పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలి. దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. రాత్రివేళల్లో గట్టిగా పహారా కాయాలి. పోలీసు ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేసి దొంగతనాలను అరికట్టాలి. నెల్లూరు నగరంలో ప్రత్యేకించి పోలీసు గస్తీని ముమ్మరం చేసి దొంగల పనిపట్టాలి.

జే. ఆర్. ఎస్. శర్మ, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## చలివేంద్రలు ఉంటే బాగుణ్ణు!

వేసవి వస్తే చాలు, నెల్లూరులో పలు ప్రధాన వీధుల్లో, కూడళ్ళలో స్వచ్ఛంధ సంస్థలు, దాతలు ముందుకు వచ్చి పాదచారుల కోసం పెద్దపెద్ద కుండలు, బానల్లో చల్లని మంచినీళ్లు, మజ్జిగతో చలివేంద్రలు ఏర్పాటుచేసేవారు. ఇప్పుడు వాటి గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. అందులోనూ ఈ వేసవికాలం భగ్గున మండిపోతోంది. రోజురోజుకీ ఎండ తీవ్రత పెరిగిపోతూ ఉంది. నెల్లూరు నగరంలో మధ్యాహ్నానికే వీధులన్నీ ఎండ దెబ్బకు నిర్మానుష్యమవుతున్నాయి. ఈ ఎండల్లో పనుల కోసం వచ్చే నిరుపేదలకు, ఇతరత్రా పాదచారుల దాహార్తి తీర్చేందుకు ధనికులు, దాతలు, స్వచ్ఛంధ సంస్థలు సంకల్పించి, నగరంలో అక్కడకక్కడా చలివేంద్రలు ఏర్పాటుచేస్తే బాగుణ్ణు!..

ఆర్కె సుబ్బయ్య, నెల్లూరు.




# అవకాశవాద రాజకీయాలకే అగ్ర తాంబూలం!

మనదేశంలో రాజకీయాలు భలే విచిత్రంగా ఉంటాయి. అందులోనూ ఎన్నికల సమయంలో రాజకీయాలు మరింత రంజుగా ఉంటాయి. ఒక్కోసారి అభ్యర్థుల మాటలు, వారి ప్రవర్తనలు ప్రజలకు చిత్రవిచిత్రంగా అనిపిస్తుంటాయి. నిన్న మొన్నటిదాకా ఒక పార్టీలో ఉన్న నాయకులు, ఉన్నట్లుండి వేరే పార్టీలోకి దూకేస్తుంటారు. ఇప్పటిదాకా ఒక పార్టీని చెడతిట్టిన నోటితోనే, అదే పార్టీ భలే గొప్పదంటూ తెగ పొగిడేస్తుంటారు. ఓడిపోతారని తమ సర్వేల్లో తేలిందనో, లేదా ఇతరత్రా రాజకీయ కారణాల వల్లనో ఒకవేళ ఎవరికైనా టిక్కెట్ ఇవ్వకుంటే, తమ పార్టీ అధినాయకులని కూడా చూడకుండా కొంత మంది నాయకులు బహిరంగంగానే దుష్ప్రచారాలకు దిగుతుంటారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలు బాగా దగ్గరపడుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన పార్టీల్లో సైతం ఇలాంటి పెడద్రపు రాజకీయాలు జోరందుకుంటున్నాయి. ఎవరు ఎప్పుడు ఏ పార్టీనుంచి ఏ పార్టీలోకి దూకేస్తారో తెలియనంతగా ఫిరాయింపు రాజకీయాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతంలోకి చూస్తే..మన దేశంలో ఫిరాయింపు రాజకీయాలకూ బోలెడంత చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వందల సంఖ్యలోనే ఈ ఫిరాయిపులు జరిగాయని చరిత్ర చెప్తోంది. ఆ 'ఘనత' నేటికీ మన ప్రజాస్వామ్యంలో కొనసాగుతూనే ఉంది. ఈ ఫిరాయింపు రాజకీయాల వల్ల ఒకప్పట్లో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూడా తలకిందులైన సందర్భాలూ లేకపోలేదు. బలాబలాలు తేల్చుకునే సమయంలో ఫిరాయింపుదారులు అటు నుంచి ఇటుకు, ఇటు నుంచి అటుకు దూకేయడంతో ప్రభుత్వాలు మారిపోయిన ఘటనలు మనదేశ రాజకీయ వ్యవస్థలో కొత్తేమీకాదు. పార్టీలు ఫిరాయించి మంత్రి వర్గాల్లో స్థానం సంపాదించిన నాయకులూ ఉన్నారంటే విడ్డూరమేం కాదు. ఈ ఫిరాయింపులన్నవి కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే కాక, ఒక్కోసారి జాతీయ స్థాయిలో కూడా బాహాటంగానే జరిగిపోతుండడం.. విడ్డూరం..!

### సిద్ధాంతాలతో పనే లేదు

ఒకప్పటి సంగతి వదిలేస్తే, నేటి రాజకీయాల్లో పార్టీ సిద్ధాంతాలతో అసలు పనే లేకుండా పోయిందా అనిపిస్తోంది. కేవలం అధికారం కోసం పాకులాడడమే పనైపోయింది. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమో, ధనార్జన కోసమో, ప్రభుత్వంలో పలుకుబడి సంపాదించుకుని స్వప్రయోజనాలను సాధించుకోవడం కోసమో కొందరు నాయకులు ఏ పార్టీ తమకు అనుకూలమని భావిస్తారో దానిలోకి ఎంచక్కా ఫిరాయించేస్తుంటారు. పాతకాలం నాయకులు కొంతమంది సిద్ధాంతాలకు, ఆశయాలకు విలువనిచ్చి, ఓడిపోయినా సరే, ప్రతిపక్షంలో ఉండడానికి కూడా వెనుకాడేవారు కాదు. ఇప్పుడలా కాదు, అధికారంలోకి ఏ పార్టీ వస్తుందని అనుకుంటారో ఆ పార్టీలోకి వెళ్లడానికే నాయకులు సిద్ధంగా ఉంటున్నారు. ఇంతకాలం నమ్ముకున్న పార్టీనుంచి బయటకొచ్చేసి, దానికి ప్రత్యర్థిగా ఉన్న పార్టీలోకి వెళ్ళాలన్నా సరే..ఏమాత్రం సంకోచించడం లేదు. జంపింగ్ రాజకీయాల్లో తామే ఫస్ట్ అంటున్నారు. అయితే, అప్పటిదాకా వాళ్లను నమ్ముకున్న సాధారణ కార్యకర్తలు మాత్రం నాయకులు వెళ్ళినంత సులభంగా ఆ పార్టీల్లోకి మారడానికి ఇష్టపడనివాళ్ళు..ఇటు ఉండలేక, అటు వెళ్లలేక మధ్యలో నలిగిపోతుంటారు. పార్టీ ఫిరాయింపులను ఎవరూ పెద్ద తప్పుగా భావించకపోవడం వల్ల నాయకులు పార్టీ ఫిరాయించడాన్ని తేలిగ్గానే తీసుకుంటున్నారు. అనేకచోట్ల ఫిరాయింపుదారులే గొప్పగా గెలిచేస్తున్నారు కూడా!

### ఫిరాయింపులదే రాజ్యం!..

ఎంతోకాలం పార్టీలకు జెండా మోసిన కార్యకర్తలను, కష్టకాలాల్లో పార్టీని నిలబెట్టినవారిని కూడా పక్కనపెట్టి, నిన్నగాక మొన్న పార్టీలో చేరిన కొత్తవారికి బ్రహ్మరథం పట్టడం, పాతవాళ్లు నోరెళ్లబెట్టడం మన రాజకీయవ్యవస్థలో ఒక భాగంగా మారిపోయింది. దీంతో అడ్డదారుల్లో పార్టీల్లోకి వచ్చేయడం, నేరస్తులు కూడా నాయకుల్ని కాకాపట్టి తామూ నాయకుల్లా చలామణి కావడం వంటి అనారోగ్య పరిస్థితులు రాజకీయరంగాన్ని ఆవరించేశాయి. విలువలు, సిద్ధాంతాల వంటివన్నీ నేటికాలంలో పాత-చింతకాయ పచ్చడి కిందే లెక్క. తమకేది లాభదాయకమో..అటు వెళ్లడమే రాజకీయం. ఏ పార్టీ పేరుతో ప్రజల్లోకి వచ్చి గెలుస్తారో, గెలిచాక వారు ఆ పార్టీలోనే ఉంటారనే నమ్మకం ఉండని రోజులివి. తమపార్టీలోకి పలానా నాయకుడు వస్తే పార్టీ గెలుపుకి ఉపయోగం అనుకుంటే, అలాంటివారి కోసం పార్టీల అధినేతలే ఏదోఒక ఎర వేసి తమ పార్టీలోకి లాక్కునే పరిస్థితి. నాయకులు కూడా అదే మంచి అవకాశమని పార్టీలను ఫిరాయించే సంస్కృతి. ఇలాంటి అనైతిక అవకాశవాద రాజకీయాలకు కళ్లెం వేసేందుకు ఫిరాయింపుల నిరోధక చట్టం అనేది ఒకటున్నా.. దానిని ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. అయినా, చట్టసభల్లో చట్టాలను చేయాల్సిన నాయకులే చట్టాలను గౌరవించకపోతే ఎలా?..అన్న సామాన్యుల ప్రశ్నకు సమాధానం దొరకదు! ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా ఉండాల్సిన రాజకీయాలు, ఇలా అవకాశవాదాలకు.. ఫిరాయింపులకు ప్రతీకలుగా ఉండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమంటూ ప్రజాస్వామ్యవాదులు ఎంతోకాలం నుంచి వాపోతున్నా పట్టించుకునేదెవరు?... ఔనౌను! మనది ప్రజాస్వామ్య దేశం కదా!.. ఎవరిష్టం వారిది మరి!..

- రాజశ్రీ

# వైకాపాలో చేరిన విష్ణు



అల్లూరు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఎట్టకేలకు వైకాపా అధినేత..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెంతకు చేరారు. ఈనెల 4వ తేది గురువారం నాడు తిరుపతి జిల్లా రేణిగుంట సమీపంలోని ఏర్పేడు వద్దకు వచ్చిన జగన్‌ను, ఆయన పెద్దఎత్తున తన అనుచరగణంతో వచ్చి కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ను ఆత్మీయంగా పలకరించి, పార్టీ కండువా కప్పి, వైకాపాలోకి ఆహ్వానించారు. నెల్లూరు వైకాపా ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సమక్షంలో ఆయన వైకాపాలో చేరారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై పోటీ చేసిన విష్ణు, ఓటమిపాలైన సంగతి తెలిసిందే! ఈ ఎన్నికలలో టిక్కెట్టు ఆయనకు కాకుండా, వేరొకరికి టీడీపీ కేటాయించడంతో, అలిగిన విష్ణువర్ధన్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి, వైసీపీలో చేరారు.

### ఆదర్శపాఠశాలల్లో

## 6వ తరగతి ప్రవేశపరీక్ష..21న

జిల్లాలోని 11 ఆదర్శపాఠశాలల్లో 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశపరీక్ష ఈనెల 21న నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఈనెల 3న ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు-ఇంగ్లీష్ మీడియంలలో పరీక్ష ఉంటుందని, దరఖాస్తు గడువును ఈనెల 6వరకు పొడిగించామని, వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని కోరారు.

### చంద్రబాబు సీఎం అయితేనే...

# రాష్ట్రానికి భవిష్యత్తు

- వింజమూరు సమావేశంలో విపిఆర్



నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈనెల 3న ఆయన ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు, వరికుంటపాడు మండలాల నాయకులు, జనసేన-బిజెపి నాయకులతో కలసి వింజమూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు కోసం జరుగుతున్నాయని, ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని, తెలుగుదేశాన్ని గెలిపించి నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఉమ్మడి ఎంపీగా తనను, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### స్వర్ణభారత్ ఆధ్వర్యంలో..

## 10 నుంచి వృత్తివిద్యల్లో ఉచిత శిక్షణ

నెల్లూరు సమీపంలోని వెంకటాచలంలో ఉన్న అక్షర విద్యాలయం ప్రాంగణంలో స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. సోమా సాంకేతిక శిక్షణ సంస్థలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కారు మెకానిజం, ఎలక్ట్రీషియన్, సివిల్ జనరల్ వర్క్, సూపర్‌వైజర్, ప్లంబింగ్ మరియు శానిటరీ, ఫ్యాబ్రికేషన్, ఏసీ మెకానిజం, టీవీ మెకానిజం కోర్సుల్లో ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆయన వివరించారు ఏప్రిల్ 10వ తేది నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని, 18 నుంచి 30 ఏళ్ళ లోపు వయసున్నవారు ఈ శిక్షణలకు అర్హులని తెలిపారు. శిక్షణా కాలంలో వసతి, భోజన సదుపాయాలను ఉచితంగా అందజేస్తామని, ఆసక్తి కలిగినవారు 93985 35137, 96522 06396 నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.


గురుదేవోభవ..!

ఆయన ఆశయాలు ఆచరణీయం
ఆయన ఆదరణ చిరస్మరణీయం
నాకు స్ఫూర్తిప్రదాత, నా ప్రగతి విధాత

రత్నం సారు

నా శ్వాసలో ఉచ్ఛ్వాస నిశ్వాసగా శాశ్వతమై నిలిచిపోతారు.



జననం 23.05.1943
నిర్యాణం 20.03.2024

పీవీఆర్‌కే మూర్తి
ఫౌండర్ ఛైర్మెన్, శ్రీ గాయత్రి
మెలూహ ఇంటర్నేషనల్ స్కూల్
క్షేత్ర సెంటర్ ఫర్ లెర్నింగ్
హైదరాబాద్

SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS | Meluha INTERNATIONAL SCHOOL | kshetra CENTER FOR LEARNING

# నెల్లూరు కబుర్లు



## శిలువ మోసిన వేమిరెడ్డి

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్ ఫతేఖాన్‌పేటలో ఉన్న పునీత అంటోనీ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శిలువను మోసి ఏసుక్రీస్తును ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వ సృష్టికర్త, మహనీయుడైన ఏసుక్రీస్తు కరుణామయుడని, అందుకే ఆయన యుగకర్త అయ్యాడని చెప్పారు. క్రీస్తు శాంతి సందేశాన్ని గుడ్ ఫ్రైడే సందర్భంగా అందరం మననం చేసుకోవాలన్నారు.

## ఆనంతో సోమిరెడ్డి భేటీ



మాజీమంత్రి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు.. సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇటీవల నెల్లూరు, సంతపేటలోని ఆనం నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించుకున్నారు.

## మహనీయ వ్యక్తి.. కేవీ రత్నం

--- నివాళులర్పించిన పనబాక లక్ష్మి ---



ఇటీవల దివంగతులైన రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం మహనీయ వ్యక్తి అని, జిల్లాకు కార్పొరేట్ విద్యను పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి కొనియాడారు. మార్చి 30న ఆమె నెల్లూరులోని హరనాథపురంలో ఉన్న కేవీ రత్నం నివాసానికి వెళ్ళి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రత్నం విద్యాసంస్థల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారందరికీ మార్గదర్శకులుగా ఉంటూ రత్నం మాస్టారు వారి భవితను తీర్చిదిద్దారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానని ఆమె చెప్పారు.

## జగన్‌ను మళ్ళీ సీఎంగా చేసుకోవాలి

- విజయసాయిరెడ్డి పిలుపు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి అమలుచేస్తున్నారని, ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, అలాంటి ముఖ్యమంత్రిని తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైకాపా నాయకుడు, నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. నెల్లూరు నగరంలోని 13 డివిజన్ యలమవారిదిన్నెలో ఆయన ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల విజయానికి అందరూ సహకరించాలని కోరారు. నెల్లూరు నగర వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్, వైకాపా జిల్లా అధ్యక్షులు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ బదిలీ



జిల్లా ఎస్పీ డా.కె తిరుమలేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీ చర్చనీయాంశంగా మారింది. అధికారపార్టీ వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో ఆయనపై బదిలీ వేటు పడినట్లు సమాచారం. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయన ఈనెల 2న విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

## ఆదాలకు మద్దతుగా ఆర్ఎస్ఆర్ ప్రచారం



నెల్లూరు రూరల్ 20వ డివిజన్‌లో నెల్లూరు రూరల్ వైకాపా ఎమెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆ డివిజన్ ఇన్‌చార్జి..వైకాపా సేవాదళ్ కార్యదర్శి రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఇటీవల ప్రచారం నిర్వహించారు. రూరల్ అభివృద్ధి ప్రదాత ఆదాల, నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డిలకు రానున్న ఎన్నికల్లో ఘనవిజయం సాధించిపెట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మద్దతు



నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇటీవల పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆదాలకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయానికి తమ వంతు కృషి చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అలగర ఝాన్సీ, సయ్యద్ ఫైజునిస్సా, ముజాఫర్, లతీఫ్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

### సంగీత పండుగలా..

## శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు



నెల్లూరు టౌన్ హాలు ప్రాంగణంలో మార్చి 30 నుంచి ప్రారంభమైన 59వ భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు గాత్రకచేరీలు, వాద్య కచేరీలు..హరికథా..భక్తిగానాలతో పెద్దఎత్తున సంగీత పండుగలా జరుగుతున్నాయి. ఈ సంగీతోత్సవాలు ప్రేక్షకులను మైమరపిస్తున్నాయి. తొలిరోజు చెన్నైకి చెందిన సంగీత విద్వాంసురాలు భవ్యహరి ఆలపించిన త్యాగరాజకీర్తనలు అందరినీ భక్తిభావ పరవశుల్ని చేశాయి. ప్రముఖ సినీగాయని ఎస్పీ శైలజ పాల్గొని సంగీత కళాకారులను సన్మానించారు. స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్, స్మరణోత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. తొలుత, వేదికపై త్యాగరాజస్వామి సమేత శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామిల విగ్రహమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి వేదికపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. శ్రీ త్యాగరాజస్వామిపై అత్యంత భక్తితో ఈ సంగీతోత్సవాలకు శ్రీకారం చుట్టిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, యనమండ్ర వేంకటేశ్వర శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రసిద్ధ కళకారులు, వర్ధమాన సంగీతకారులతో ఉత్సవాలు ఈనెల 5వతేది శుక్రవారం వరకు వైభవంగా జరుగనుండడంతో నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలకు తరలివస్తున్నారు.

## విఎస్‌యులో ఓటు హక్కుపై అవగాహన

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియో గించుకోవాలని వీఎస్‌యు వీసీ ఆచార్య జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో ఈనెల 2న అమరవీరుల దినోత్సవంలో భాగంగా, ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం ఓటు హక్కు అని, దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ విజయానందకుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి..వేసవి సెలవులు

రాష్ట్రంలోని పాఠశాలలకు ఈనెల 24వ తేది నుంచి వేసవి సెలవు లను ప్రకటించారు. మళ్ళీ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవు తాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఈనెల 2న ఉత్తర్వులు జారీ చేశారు.

## ధాన్యం కొనుగోళ్ళకు ఏర్పాట్లు

జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈనెల 2న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీనరసింహారావు, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, డిఎస్ఓ వెంకటరమణ సమావేశమ య్యారు. రైతులు నష్టపోకుండా, వారు పండించిన ధాన్యానికి మంచి ధరలు వచ్చేలా రైతుభరోసా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని సూచించారు.






## శంకరమఠంలో.. బదరీనాథ్ పీఠాధిపతి



బదరీనాథ్ పీఠాధిపతి, అయోధ్య రామాలయం ట్రస్టు సభ్యులు శ్రీ వాసు దేవానంద్ సరస్వతి మహా రాజ్ వారు ఇటీవల నెల్లూ రుకు వచ్చి శంకరమఠంలో కొలువైవున్న శ్రీ కంచి కామాక్షి చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతులకు ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళీస్వామి, మేనేజర్ నందకిషోర్, కార్యనిర్వాహకురాలు ఉషాకుమారి తది తరులు స్వామీజీకి స్వాగతం పలికి, ఆలయంలో పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

### పింఛన్ల విషయంలో..

## కావాలనే టీడీపీపై దుష్ప్రచారం

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



పింఛన్ల పంపిణీకి టీడీపీ అడ్డుపడుతోందంటూ కావాలనే వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, వైసీపీ నేతల అత్యుత్సాహంతోనే వలంటీర్లపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది తప్ప, అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వడానికి ఎప్పుడూ టీడీపీ వ్యతిరేకం కాదని మాజీమంత్రి, సర్వేపల్లి వైకాపా అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటాచలం మండలం కసుమూరులో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీలో జరుగుతున్న ఆలస్యానికి టీడీపీయే కారణమనే కుట్రపూరిత ప్రచారానికి వైకాపా నాయకులు పూనుకోవడం దారుణమన్నారు. ఆ పాపం ముమ్మాటికీ వైకాపాదేనన్నారు. వైకాపా నేతల ప్రోద్భలంతో వలంటీర్లు నేరుగా ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రచారంలో పాల్గొనడం జరుగుతుంటే, ఎన్నికల ప్రక్రియకు వలంటీర్లను దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, వారికి మంచి భవిష్యత్ కల్పిస్తామని తమ నాయకుడు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆయన కోరారు.

# చంద్రబాబు వస్తే రాష్ట్రం సర్వనాశనం

**- ఆదాల ప్రభాకర్‌రెడ్డి విమర్శ**



రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. నెల్లూరు రూరల్‌లోని ములుముడి గ్రామంలో బీజేపీతో టీడీపీ పొత్తును నిరసిస్తూ ఇటీవల అనేకమంది ముస్లింలు తెలుగుదేశం పార్టీ నుంచి వైకాపాలోకి చేరగా, వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి వైకాపాలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో పేదవాళ్ల సంక్షేమ పథకాలను నారా చంద్రబాబునాయుడు అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తుడిచిపెట్టుకుపోయే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని, ములుముడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా ఖాళీ అయిపోయిందని ఆయన అన్నారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ జెండాను మోసిన కీలక నాయకులు, కార్యకర్తలు దాదాపు 400మంది ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి సీఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా నిలిచారని, తన ఆధ్వర్యంలో రూరల్‌లో ఇటీవలి కాలంలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై వైకాపాలో చేరారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మతోన్మాది పార్టీ అయిన బీజేపీతో పొత్తు పెట్టుకోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోందన్నారు. వైకాపాలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించి, రానున్న రోజుల్లో వారందరికీ అన్ని విధాల సంపూర్ణ సహాయసకారాలు అందిస్తామని ఆదాల భరోసా ఇచ్చారు.



### శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో

## ప్రశాంతమ్మ పూజలు

కోవూరు టిడిపి-బిజెపి-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో వెలసి వున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోని స్వామి వారిని దర్శించుకుని అర్చకుల ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ

## తొలి జాబితా వచ్చేసింది

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 2న కడప నుంచి ప్రకటించారు. వారిలో జిల్లాలోని నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి షేక్ ఫయాజ్, కోవూరు నుంచి ఎన్.మోహన్, సర్వేపల్లి నుంచి పూల చంద్రశేఖర్, ఉదయగిరి నుంచి సోము అనిల్‌కుమార్ రెడ్డి, ఆత్మకూరు నుంచి చేవూరు శ్రీధర్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గం నుంచి గౌస్‌మొహిద్దీన్‌లు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేయనున్నారని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసే సందర్భంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డితో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ వామపక్ష పార్టీలతో పొత్తుపెట్టుకున్న నేపథ్యంలో, నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా సీపీఎం అభ్యర్థికి చోటివ్వాలని ఆ పార్టీ నాయకులు కోరడంతో, ఆ స్థానంపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఇరుపక్షాల నాయకులు చర్చిస్తున్నట్లు సమాచారం. అన్ని కుదిరితే, నెల్లూరు నగరస్థానం సీపీఎం అభ్యర్థికి కేటాయించవచ్చని కూడా పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.




# సింహపురి సీమలో గుబాళిస్తున్న
# వేమిరెడ్డి దంపతుల సేవా పరిమళాలు



జిల్లాలోని మెట్టప్రాంతాల్లో ఉన్న అనేకగ్రామాల్లో ఎంతోమంది ప్రజలు నిత్యం మంచినీళ్ళు దొరక్క ఏళ్ళ తరబడిగా అవస్తలు పడుతుంటే ఎవరు పట్టించుకున్నారు?.. వేలాదిమంది నిరుపేద చిన్నారులు రకరకాల కష్టాలతో కన్నీళ్ళు పెట్టుకుంటుంటే ఎవరు ఆదుకుంటున్నారు?.. చదువుకునేందుకు సరైన సదుపాయాలు లేక ఎంతోమంది పేద విద్యార్థులు నానా బాధలు పడుతుంటే ఎవరు వారికి విద్యాభిక్ష పెడుతున్నారు?..ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఆ బాధలు తీర్చడానికి తనవంతు సేవలందిస్తున్న మహనీయ దాత.. మహోన్నత సేవా ప్రదాత.. సేవా భూషణులు.. ఒక్క విపిఆర్ అనే చెప్పుకోవచ్చు.

నేటి కలికాలంలో అలాంటి సేవామూర్తులు నిజంగానే అరుదు. నిష్కల్మషంగా, త్రికరణశుద్ధితో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకి ఎల్లలు లేవు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని దేవాలయాలకు ఎంతెంత విరాళాలిచ్చారో వారికే గుర్తుండదు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తీశ్వర దేవాలయానికి లక్షలాది రూపాయలు వెచ్చించి వాహనాలను సమకూర్చారు. కర్నూలు జిల్లా శ్రీశైల మల్లికార్జునునికి బంగారు రథం సమర్పించారు. నెల్లూరుజిల్లాలోని కందుకూరు అంకమ్మ గుడికి ఇటీవలే భూరి విరాళం అందించారు. తిరుమల వెంకన్నకు కొండపై జరిగే సేవలు ఎంత వైభవంగా జరుగుతాయో సింహపురీయులు కూడా తెలుసుకోవాలని, ఆ సేవలను నేరుగా తిలకించి తమ జీవితాలను ధన్యం చేసుకోవాలని నెల్లూరులో అత్యంత వైభవోపేతంగా 'శ్రీవారి వైభవోత్సవాలు' నిర్వహించేందుకు వేమిరెడ్డి దంపతులు కోట్లు ఖర్చుపెట్టారు. కుంభాభిషేకాలకి కొదవేలేదు. కాణీపాకం వినాయకస్వామి, సూళ్లూరుపేట చెంగాళమ్మ, జొన్నవాడ కామాక్షమ్మ, దుర్గామిట్ట రాజరాజేశ్వరమ్మలతో పాటు ఇంకా రాష్ట్రంలో పలు దేవాలయాలలో కుంభాభిషేకాలు నిర్వహించిన ధన్యచరిత్ర ఆ పుణ్యదంపతులది. ఇవన్నీ అందరికీ తెలిసినవే. ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నో.. ఎన్నెన్నో!.. పైకి కనిపించే దాతృత్వాలే బోలెడన్ని. ఇక గుప్తదానాలంటారా.. వాటికి లెక్కే లేదు. ఎవరికెంతిచ్చారో వారెప్పుడూ లెక్కలు వేసుకోలేదు. అసలలాంటి మనస్తత్వమే విపిఆర్‌కి లేదు. ఎన్ని దానాలు చేసినా ఆయనెన్నడూ తనో గొప్ప దానకర్ణుడినని ఆయన ఏనాడూ చెప్పుకోలేదు. తానుచేసే సేవలను ఏ కీర్తికోసమో, రాజకీయాల కోసమో ఉపయోగించుకోవాలనే దురాశ కూడా ఆయనకెప్పుడూ లేదు. ఎన్నికల కోసమో.. తాను గెలవడం కోసమో... ఇవన్నీ స్వార్థంతో ఆయన చేస్తున్నారనుకుంటే, అంతకంటే ఆత్మవంచన మరొకటి ఉండదు. అసలు, ఇప్పుడు కాదు, ఏళ్ళ తరబడిగా ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. లక్షలాది రూపాయలను తృణప్రాయంగా భావించి, అభాగ్యులకు.. అసహాయులకు ఆపద్బాంధవునిగా అవసరమైన సాయం అందజేస్తూనే ఉన్నారు. చిన్నతనంలోనే.. విద్యార్థి దశ నుంచీ ఆయనది సేవాగుణం. అది దైవగుణం. సేవపైనే ఆయనకెప్పుడూ ధ్యాస.. సేవే ఆయనకు శ్వాస. అదే ఆయన నైజం. దానగుణం అన్నది ఒకరు చెప్తే వచ్చేది కాదు..పుట్టుకతోనే రావాలి. తాను బతకడమే కాదు.. పదిమందీ చల్లగా బతకాలనే మానవతా భావన ఉండాలి. అంతే తప్ప, పది రూపాయలు ఖర్చుపెట్టి, వంద రూపాయల ప్రచారం కావాలని కోరుకునే అల్ప మనస్సు కాదు ఆయనది. లక్షలాది రూపాయలు విరాళాలుగా ఇచ్చినా ఆయన ఏనాడూ వాటిని గొప్పగా చెప్పుకోలేదు. ఎంత గొప్ప పనులు చేసినా, అవన్నీ ఆ భగవంతుడు తనకిచ్చిన సదవకాశాలే అనుకునే వినమ్రశీలి ఆయన. ఇంత సహృదయం.. నిస్వార్థ సమాజ సేవాభావం ఎందరికుంటుంది?.. దాతలకు.. నెరదాతలకు పుట్టినిల్లయిన నెల్లూరుసీమ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డిల వంటి మహాదాతల ఆవిర్భావంతో మరింత ధన్యత పొందిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నది నిర్వివాదాంశం!..ఒక్క మాటలో చెప్పాలంటే, సింహపురి సీమకే వారు గర్వకారణం!.. వారి సేవలు అందరికీ మార్గదర్శకం!...

అలాంటి సేవామూర్తులను.. అందరూ అభిమానంతో ఆదరించి, నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు శాసనసభ్యురాలిగా ప్రశాంతిరెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికలలో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత, బాధ్యత జిల్లా ప్రజలపై ఉంది.

ఎంత డబ్బున్నా.. దానగుణం లేకుంటే ఆ డబ్బుకి సార్థకత లేదన్నది పెద్దల మాట. ధనవంతులకు కొదవ లేని జిల్లా నెల్లూరుజిల్లా. కానీ, దానగుణం మాత్రం తక్కువే!.. కోట్లున్నా పిల్లికి బిచ్చం పెట్టని వాళ్లు కోకొల్లలు. ఎవరెటుపోతేనేం.. మనం బాగుంటే చాలు అనుకునేవారే ఎక్కువ. కానీ, వేమిరెడ్డి మనస్తత్వం అందుకు భిన్నం. తాను సంపాదించిన దాంట్లో అధిక భాగాన్ని పేదలకు, అసహాయులకు, అన్నార్తులకు ఖర్చు చేయడం తనకొక అదృష్టంగా భావించే మానవతా హృదయం ఆయనది.

## నిరుపేద విద్యార్థులకు వరం.. 'విపిఆర్ విద్య'




చిన్నతనం నుంచి బడుల్లో చదువుకోవడం చిన్నారులకో వరం!..బడిలో..చదువుల తల్లి ఒడిలో చిన్నారులు ఆడుకుంటూ పాడుకుంటూ భవితకు తొలి అడుగులు వేస్తుంటారు. అయితే దురదృష్టవశాత్తూ ఎంతోమంది నిరుపేద చిన్నారులు ఆ భాగ్యానికి నోచుకోవడం లేదు. కుటుంబ పరిస్థితులు, తల్లితండ్రుల అమాయకత్వం, అజ్ఞానం తదితర కారణాలతో నేటికీ ఎందరో పేదపిల్లలు బడిబాట పట్టడం లేదు. ఈ నేపథ్యంలో, నిరుపేద బాలబాలికల విద్యకు తనవంతు ప్రోత్సాహాన్ని అందిస్తూ, ఎందరో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు పంచుతున్నారు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు. వారు నిర్వహిస్తున్న సామాజిక సేవల్లో భాగంగా, ముఖ్యంగా పేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో వారు చేస్తున్న సేవలు, కృషి అపారం..అపూర్వమనే చెప్పాలి. తమదైన ప్రత్యేకతతో, అత్యంత ఆధునిక సౌకర్యాలతో విపిఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పాఠశాల భవనాన్ని నిర్మించి ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ళలో లభించే అన్ని వసతులను ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసి, పేదవారికి 'విపిఆర్ విద్య' పేరుతో ఉచిత విద్యని అందిస్తుండడం వారి సేవాభావానికి ఇదో ఉదాహరణ. ఆ నిరుపేద విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు రవాణా సౌకర్యంతో పాటు యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో సహా 'విపిఆర్ విద్య'లో అన్నీ ఉచితంగా వారికి అందిస్తున్నారంటే విపిఆర్ దంపతుల ఔదార్యానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి!..'మీరు బాగా చదువుకోండి. ప్రతిభతో రాణించండి. అందుకు మావంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని' వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనేకసార్లు విద్యార్థులకు భరోసా ఇవ్వడం విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఎంత సంతోషం కలిగిస్తోందో చెప్పలేం. సాధారణంగా, దాతలు అనేవారు దానమిచ్చి వెళ్తుంటారు. అలాకాక, తమ దాతృత్వంతో పేదలకు అందుతున్న సేవలు ఎంతవరకు సద్వినియోగం అవుతున్నాయో కూడా దగ్గరుండి పర్యవేక్షిస్తూ, ఆ నిరుపేద విద్యార్థులకు ఇంకా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ వారి భవితకు బంగారుబాటలు వేయడం మనం ఒక్క 'విపిఆర్ విద్య'లోనే చూడగలమంటే అతిశయోక్తి కాదు.







## జిల్లాకు విపిఆర్ విద్యాసుగంధాలు

సమాజం బాగుపడాలంటే ముందుగా విద్యాభివృద్ధి ఉండాలి. చదువుతోనే ఎంతటి ఉన్నత స్థానాన్నయినా సాధించవచ్చనే దృఢవిశ్వాసంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు తొలినుంచి విద్యకు పెద్ద పీట వేశారు. అది ఏ ప్రాంతమని కాదు, ఏ పాఠశాల అని చూడలేదు. ఎక్కడ అవసరమైతే అక్కడ తామున్నానంటూ వారు విద్యాభివృద్ధికి వెలుగుబాటలు పరిచారు. ఎందరో నిరుపేద విద్యార్థుల భవితకు పునాదులు వేశారు. మొదటగా విపిఆర్.. తాను ఓనమాలు నేర్చుకున్న "రిషీవ్యాలి" స్కూలు పరిపాలనా భవనానికి ఆ తర్వాతకాలంలో తానే రూపకల్పన చేసి, తానే నిర్మించి తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి అవసరమైన సాయమంతా చేసి, తాను చదువుకున్న పాఠశాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇక అక్కడి నుంచి ఆయన విద్యాదాతగా ఎన్నో ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. 'రిషివ్యాలి' పాఠశాలకు అవసరమైనప్పుడల్లా ఆర్థికసాయం అందజేస్తూ ఉండడమే కాక, 1979 ప్రాంతంలోనే తన సోదరి అత్తవారిల్లయిన తమిళనాడులోని జోలార్‌పేట సమీపంలోని తిరుపత్తూర్ గ్రామంలో "స్కూల్ డ్రాప్ అవుట్ ప్రివెన్షన్ స్కీమ్"ను ప్రారంభించి పేదవారికి అండగా ఉన్న ఓ పాఠశాలకు ఆ రోజుల్లోనే పెద్దమొత్తంలో ఆర్థిక సహాయాన్ని అందించారు.

## అనేక పాఠశాలలకు భారీ విరాళాలు

నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లో వసతుల కోసం అనేక సందర్భాల్లో వేమిరెడ్డి కాదనకుండా-లేదనకుండా భారీస్థాయిలో ఆర్థిక సహాయం అందించారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'అక్షర' పాఠశాలకు కూడా పెద్దమొత్తంలో విరాళాలిచ్చి ప్రతిఏటా మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేసేలా ఏర్పాటు చేశారు. అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాల పాఠశాల మరమ్మత్తుల కోసం భూరివిరాళం అందించారు. నెల్లూరు, కోవూరు, వెంకటాచలం, కనుపర్తిపాడులతో పాటు నెల్లూరు జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు.. రోటరీక్లబ్ అంబత్తూర్ (చెన్నై) వారి సౌజన్యంతో ప్రతియేటా లక్షలాది రూపాయలతో అవసరమైన విద్యాసామాగ్రిని కిట్‌ల రూపంలో పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

## 'సరస్వతీనిధి'కి చేయూత

గతంలో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా పనిచేసిన బి.శ్రీధర్ పేద విద్యార్థుల ఉన్నత చదువుకోసం ప్రవేశపెట్టిన 'సరస్వతీ నిధి' పథకానికి విపిఆర్ పెద్దమనసుతో లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ప్రత్యేకించి నెల్లూరులోని పలు ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి తనవంతు చేదోడుగా విద్యార్థులకు అవసరమైన పళ్ళాలు,



గ్లాసులు పంపిణీ చేసి పేద విద్యార్థులు బాగా చదువుకోవాలని నిండుమనసుతో విపిఆర్ దంపతులు ఆశీర్వదించారు. నెల్లూరులోని పలు పాఠశాలల భవన నిర్మాణాలకు కూడా పెద్దమెత్తాల్లో సాయమందించారు. రామమూర్తినగర్‌లోని గంజిఖానా పురపాలక పాఠశాల భవన నిర్మాణానికి భారీగా ఆర్థిక సాయం అందజేశారు.

## కస్తూరిదేవి విద్యార్థినులకు ప్రోత్సాహం

ఎయిడెడ్ పాఠశాలల్లో చదివేవారు ఖచ్చితంగా యూనిఫాం ధరించి అందరూ సమానభావనతో, ఒకేలా కనిపించేలా వుండాలన్న లక్ష్యంతో కస్తూరిదేవి బాలికల పాఠశాలలో విద్యార్థినులకు పలుసార్లు యూనిఫాంలు అందజేసి బాగా చదువుకోవాలని ప్రోత్సహించారు. ఇలా పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి అన్నివిధాలుగా తమవంతు అండదండలందిస్తూ నెల్లూరుసీమలో అపర దానకర్ణులుగా, విద్యాదాతలుగా ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి అందరి ప్రశంసలందుకుంటున్నారు.







## మహనీయుల విగ్రహాల స్థాపన

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల సేవా కార్యక్రమాలతో గుబాళించని రంగమే లేదు. కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా సామాజిక అవసరాలు తీర్చడానికి విద్యా రంగం, వైద్య రంగం, క్రీడా రంగం, ఆధ్యాత్మిక రంగాలతో పాటు ఎన్నో అనాథాశ్రమాలను, వృద్ధాశ్రమాలను ఆయన తన దాతృత్వంతో పోషిస్తున్నారు. సేవకు మరోపేరుగా నిలుస్తూ, ఎక్కడ ఎవరికి ఏ సాయం అవసరమైనా తామున్నానంటూ వారికి అండదండలందిస్తూనే ఉన్నారు.

నిన్నటి తరం వారు రేపటితరం వారికి స్ఫూర్తిప్రదాతలుగా ఉండాలన్నది ప్రభాకర్‌రెడ్డి సంకల్పం. ఎక్కడైనా వారి విగ్రహాలను చూసినప్పుడు, వారు చేసిన మంచితో పాటు వారి ప్రతిభా పాటవాలను గురించి తెలుసుకునే అవకాశం ప్రజలకు కలుగుతుందన్నది ఆయన భావన. అందుకోసమే నెల్లూరునగరంలో పలువురు మహోన్నత వ్యక్తుల విగ్రహాల స్థాపనకు విపిఆర్ తనవంతు చేయూతనందించారు.

నెల్లూరు మినీబైపాస్ (రాజీవ్‌మార్గ్)లో ఏర్పాటు చేసిన ఆంధ్రరాష్ట్ర మాజీముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ మాజీగవర్నర్, జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డా. బెజవాడ గోపాలరెడ్డి విగ్రహ స్థాపనకు విపిఆర్ అవసరమైన సాయం అందజేశారు. అంతేకాదు, ప్రముఖ వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి విగ్రహం నెలకొల్పి భక్తితత్వానికి పెద్దపీట వేశారు. దేశంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం విశేషకృషి చేసిన నాటి మహనీయులు జ్యోతిరావుపూలే, ఆయన సతీమణి సావిత్రిభాయి పూలేల విగ్రహాల స్థాపన కూడా ఆయన చేతిచలువే. నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రం ప్రాంగణంలో అత్యంత సుందరంగా ఏర్పాటుచేసిన ప్రఖ్యాత తెలుగు సినీగాయకులు పద్మశ్రీ డా. ఘంటసాల వేంకటేశ్వరరావు విగ్రహం కూడా ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో ఏర్పాటు చేయబడినదే!





## బీసీ హాస్టల్‌కు..'వేమిరెడ్డి' పేరు




ఎందరో కష్టజీవులు, శ్రామికులు తమ పిల్లలు తమలాగా జీవితంలో ఇబ్బందులు పడకుండా, బాగా చదువుకుని సమాజంలో మంచిస్థాయిలో స్థిరపడాలని ఆశపడతారు. ఏరోజుకారోజు కూలీతో జీవనం సాగించే అలాంటివారికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలే ఆధారం. కానీ వాటిలో ఎలాంటి సౌకర్యాలు లేక బాలబాలికలు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. అది గమనించిన విపిఆర్.. నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద వున్న ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక వసతులు కల్పించి ఆ పేద విద్యార్థుల కళ్ళల్లో ఆనందాన్ని చూశారు. ఆయన దాతృత్వాన్ని గుర్తించిన ప్రభుత్వం 'వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాలుర వసతిగృహం'గా ఆ భవనానికి నామకరణం చేయడం విశేషం. రాష్ట్రంలో ఒక బీసీ బాలుర వసతి గృహానికి అలా ఒక దాత పేరు పెట్టడం.. ఒక్క నెల్లూరుకే ఆ ఘనత లభించిందంటే, అది విపిఆర్ సేవాభావానికి.. దానగుణానికి మరో నిదర్శనం.

## 'వాత్సల్య'పై ఎనలేని వాత్సల్యం

అనాథ బాలబాలికలన్నా, ఏ ఆధారం లేక బాధపడుతున్న వృద్ధులన్నా వేమిరెడ్డికి ఎంతో అభిమానం. అందరూ నిరాదరించిన ఆ అభాగ్యులను ఆదుకోవడం ఒక అదృష్టమనే మానవీయ మనస్తత్వం ఆయనది. అందుకే, ఎందరో అనాథ బాలబాలికలతో పాటు కన్నబిడ్డలకు బరువై, నిరాధార వృద్ధుల కోసం నిర్వహింపబడుతున్న నెల్లూరులోని 'వాత్సల్య' సంస్థ అంటే ఆయనకు ఎనలేని వాత్సల్యం. ఆ సంస్థ భవన నిర్మాణం కోసం భూరి విరాళాన్ని అందజేయడమే కాక, ప్రతి సంవత్సరం ఆగష్టు నెల మొత్తం అక్కడ ఆశ్రయం పొందుతున్న బాలబాలికలు, వృద్ధులకు వారి భోజన ఖర్చును ఆయనే గత కొన్ని సంవత్సరాలుగా భరిస్తున్నారు. ఆ వ్యయం లక్షల్లో ఉన్నా ఆయనేనాడూ లెక్కపెట్టింది లేదు.

అదేవిధంగా, నెల్లూరు నగరంలోని రత్నం విద్యాసంస్థల సారధి, ఇటీవలే దివంగతులైన కె.వి.రత్నం సారథ్యంలో అప్పట్లో రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక సంస్థగా పేరొందిన 'చిన్నారి హార్ట్‌ఫౌండేషన్' ద్వారా చిన్నపిల్లల గుండె ఆపరేషన్లకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లక్షలాది రూపాయల సాయం అందజేశారు.

ఒక్క నెల్లూరులోనే కాదు, తమిళనాడులో కూడా దాదాపు 1600 మంది మానసిక వికలాంగులకు అండగా నిలుస్తున్న తమిళనాడు స్పాస్టిక్ సొసైటీకి విపిఆర్ అనేకసార్లు పెద్దమొత్తంలో ఆర్థిక సహాయాన్ని అందించడం ఆయన దానగుణానికి ఓ చిన్న ఉదాహరణ మాత్రమే!..

మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు స్వర్గీయ గ్రోసు గోపాలయ్య స్థాపించిన 'మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమం' భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడమే కాక, ప్రతి సంవత్సరం మార్చి మాసంలో తన తండ్రి కీ॥శే॥ వేమిరెడ్డి శివకోటారెడ్డి స్మృత్యంకంగా ఆ మాసం మొత్తం అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అయ్యే భోజనఖర్చును ప్రభాకర్‌రెడ్డే అందజేస్తున్నారు. ఇది ఏ ఒక్క సంవత్సరమో కాదు, గత కొన్నేళ్ళుగా జరుగుతూనే ఉంది.





# అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి

## వేమిరెడ్డి దంపతులు



అల్లా చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ–జనసేన–బీజేపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విడవలూరు మండలం ముదివర్తిలో స్థానిక నాయకులు రఫీ, ముస్లిం మతపెద్ద నూర్‌బాషా ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఈద్గాలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథులుగా వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను వేమిరెడ్డి దంపతులు ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు దేవిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, అనీఫ్, శరద్ చంద్ర, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడే వారికి.. అండగా ఉంటాం

## - వైకాపా అనుబంధ సంఘాలతో రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి పార్టీపై ప్రజాభిమానం మరింత పెంచేలా అనుబంధ సంఘాల నాయకులు పనిచేయాలని, అన్ని స్థానాల్లో వైకాపా విజయం సాధించేందుకు ముమ్మరంగా కృషిచేయాలని వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తన నివాసంలో పార్టీ బలోపేతంపై వైకాపా అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. టిడిపి బూటకపు హామీలను ప్రజలకు వివరించాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారికి నేదురుమల్లి కుటుంబం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో పింఛన్లు అందుకునే అవ్వ తాతలపై టిడిపి పగబట్టి ఇంటి వద్దకే వారికి పింఛన్ అందించే కార్యక్రమాన్ని రద్దు చేయించేందుకు టీడీపీ నేతలు కుట్రలు పన్నారని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ 5 నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తాను ప్రచారంలో పాల్గొంటానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా అనుబంధ విభాగాల నాయకులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో బీజేపీ కార్యాలయం

ఆత్మకూరులోని జేఆర్‌పేటలో మార్చి 30న బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడుతూ టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అభ్యర్థులైన ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. బీజేపీ కో–కన్వీనర్ నరసింహనాయుడు, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు బాలయ్యనాయుడు, సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.


స్మృత్యంజలి

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి॥



శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారు
జననం: 10.6.1971 స్వర్గలోకప్రాప్తి : 7.4.2018

మా తృతీయ సోదరి
శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారి
6వ వర్ధంతి సందర్భంగా
వారి దివ్యస్మృతిని స్మరించుకుంటూ..
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు :
మల్లిఖార్జునరెడ్డి కైపు
రాంజీనగర్, నెల్లూరు.
Portland, USA.
మరియు
కుటుంబసభ్యులు


# బుచ్చిలో ప్రశాంతిరెడ్డి కుమార్తె ప్రచారం



కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ 13వ వార్డులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమా రెడ్డి ఇటీవల విస్తృత ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధిని, వైకాపా అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# డిఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం




అల్లూరు సమీపంలోని నార్త్‌మోపూరు గ్రామంలో ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్(డిఎస్ఆర్ ట్రస్ట్) సేవలు అభినందనీయమని, స్వగ్రామానికి..సమాజానికి సేవ చేయాలనే తలంపుతో ఈ ట్రస్ట్‌ను నెలకొల్పడం హర్షదాయకమని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం కొనియాడారు. మార్చి 30న ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలోని దేవిరెడ్డి శారద హైస్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేడీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ట్రస్ట్ యాజమాన్యం ఇక్కడ విద్య, వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫంక్షన్‌హాలు అన్నీ ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేయడాన్ని ఆయన ప్రశంసించారు. డిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లతాచౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామ చంద్రయ్య, ట్రస్ట్ వైద్యులు డాక్టర్ జెట్టి రమేష్ పాల్గొన్నారు.



# ప్రజలే మాకు అండ

## వైకాపా నేతలు విజయసాయి, ప్రసన్న

రానున్న ఎన్నికల్లో వైకాపా విజయానికి అందరూ కృషిచేయాలని వైకాపా నాయకులు, నెల్లూరు పార్లమెంట్ ఎంపీ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు అసెంబ్లీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలను కోరారు. ఇటీవల వారు కోవూరు మండలం పడుగుపాడు నేషనల్ హైవే వద్ద కోవూరు నియోజకవర్గంలోని గిరిజనులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు తమకు అండగా నిలవాలన్నారు. ప్రజలకు మంచిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను కుప్పకూల్చాలని టీడీపీ నేత చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. ఎంతోకాలం నుంచి ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని, రాష్ట్రంలో మళ్ళీ జగన్ సీఎం అవుతారని, కోవూరులో గెలవబోయేది తానేనని ప్రసన్న ధీమా వ్యక్తం చేశారు.

# నాన్న ద్వారానే.. రూరల్‌లో అభివృద్ధి

## - ఆదాల కుమార్తె హిమబిందు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల నుండి వస్తున్న స్పందన అద్భుతంగా ఉందని నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఆదాల హిమబిందు చెప్పారు. తాను గతంలో చూసిన నెల్లూరు వేరని, ఇప్పుడు చూస్తున్న నెల్లూరు ఎంతో అభివృద్ధి చెందిందని, ఆ అభివృద్ధికి తమ నాన్నే కారణమని భావిస్తున్నానని ఆమె అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 28వ డివిజన్ ఇన్‌చార్జ్ నెల్లూరు మదనమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ తండ్రికి మద్దతుగా ఆమె ఈనెల 1న ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి మీ అందరి సంపూర్ణ మద్దతుతో ఎమ్మెల్యేగా ఎన్నిక కాబోతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయం సాధించబోతున్న విజయసాయిరెడ్డి అన్నివిధాల ప్రజలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు.



# ఇఫ్తార్ విందులో... ఆదాల

పవిత్ర రంజాన్ మాసం పరిష్కరించుకొని 35వ డివిజన్ పొదలకూరు రోడ్‌లోని మసీదులో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల రూరల్ మైనారిటీ నాయకులు కంతర్ అలీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షను ఆచరించడం చాలా గొప్ప భాగ్యమని ఆయన అంటూ, ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. 34వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ రియాజ్, మైనారిటీ నాయకులు ఉమర్ పాల్గొన్నారు.

## చింతారెడ్డిపాలెం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఇటీవల ఆదాల ప్రభాకర్‌రెడ్డి చింతారెడ్డిపాలెంలోని ఆర్‌సిఎం చర్చిలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు కృపతో తాను ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ప్రార్థించారు. ఈస్టర్ పండగ సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, క్రైస్తవ సోదరులు, స్థానిక వైకాపా నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

## - వేమిరెడ్డి భరోసా

ఆర్యవైశ్యులంటే నీతి, నిజాయితీలకు, నమ్మకానికి మారుపేరని, వారికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

ఇటీవల నెల్లూరులోని 44వ డివిజన్ ఆచారివీధిలో, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా.పొంగూరు నారాయణతో కలిసి ఆయన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు ఆర్యవైశ్యులంటే ప్రత్యేక అభిమానమని, తాము నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో అవగాహన లేకపోవడం వల్లనే నారాయణను గెలిపించుకోలేకపోయామని అంటూ, ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా చేజారకూడదని, ప్రతి ఓటు మనకు ముఖ్యమని అన్నారు. తామెప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, నెల్లూరు నగర అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తొలుత ఆయన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై వాసవీ మాతా అంటూ నామస్మరణ చేయడంతో సమావేశ ప్రాంగణమంతా భక్తిపారవశ్యం నెలకొంది.

నెల్లూరు పార్లమెంట్ వాణిజ్యవిభాగం



అధ్యక్షులు దర్శి హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నెల్లూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్, ఫ్యాన్సీ అండ్ జనరల్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులతో పాటు అధికసంఖ్యలో 44వ డివిజన్ ఆర్యవైశ్యులు, అనేకమంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.









# పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

## శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 41 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి- | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి - | స్నిగ్ధ | సోమిరెడ్డి ఆగస్త్య | |

# కల్యాణ వైభవం...!

మహిధర్ - హన్విత



ప్రముఖ కాంట్రాక్టర్, నెల్లూరు వాస్తవ్యులు బట్రెడ్డి వెంకట కృష్ణారెడ్డి - అరుణల కుమారుడు
**మహిధర్‌రెడ్డి - హన్విత** (హైదరాబాద్ వాస్తవ్యులు యార్కారెడ్డి శివరామకృష్ణారెడ్డి - లక్ష్మిల కుమార్తెల
పరిణయం మార్చి 27వ తేదీ హైదరాబాదులో, రిసెప్షన్ మార్చి 31వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగాయి.
కొత్త జంటకి 'లాయర్' శుభాభినందనలు.

శశి - దివ్య



బెంగళూరు వాస్తవ్యులు ముటుకుందు వెంకటేశ్వరరెడ్డి - రత్నమ్మల కుమారుడు
**శశి వర్ధన్‌రెడ్డి - తేజ దివ్య** (కడప నగరం వాస్తవ్యులు కంభం మల్లేశ్వరరెడ్డి - రామలక్ష్మమ్మల కుమార్తెల
వివాహం మార్చి 27వ తేదీ తిరుమలలో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

భార్గవ - ప్రీతి



వింజమూరు మండలం, యర్రబల్లిపాళెం వాస్తవ్యులు యన్నం రామచంద్రారెడ్డి - అరుణల కుమారుడు
**భార్గవ నరసింహా రెడ్డి - ప్రీతి** (కడప జిల్లా వాస్తవ్యులు గౌరు ప్రభాకర్‌రెడ్డి - అపర్ణల కుమార్తెల పెళ్లి
మార్చి 30వ తేదీ కడపలో వేడుకగా జరిగింది. నవ వధూవరులకి 'లాయర్' శుభాకాంక్షలు.

# పార్టీల అభ్యర్థులకు.. 'సువిధ యాప్'తో అనుమతులు

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారం కోసం అధికారుల నుంచి వేగంగా, ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండా అనుమతులు పొందేందుకు భారత ఎన్నికల సంఘం సువిధ సింగిల్ విండో యాప్‌ను ప్రవేశపెట్టింది. ఎన్నికల నేపథ్యంలో ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిర్వహించే పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల సంఘం అనుమతిని తీసుకునేందుకు ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చు. అభ్యర్థులు 48 గంటలకు ముందు దరఖాస్తులు చేసుకుంటే, 24 గంటల్లోనే అధికారులు అనుమతులు జారీ చేస్తారు. మీటింగ్‌లు, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎలక్షన్ ఆఫీస్, లౌడ్ స్పీకర్, హెలికాప్టర్, హెలిప్యాడ్, ఇంటింటి ప్రచారం, డిస్ ప్లే బ్యానర్స్, ఫ్లాగ్స్, ఎయిర్ బెలూన్స్, హోర్డింగులు, బ్యానర్లు, వీడియో వ్యాన్ మొదలైనవాటికి అనుమతులు పొందేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభతరంగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేలా ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. అలాగే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయాల వద్దనే అనుమతి తీసుకునేందుకు వీలుగా కూడా సువిధ కౌంటర్‌ను జిల్లా యంత్రాంగం ఏర్పాటుచేసింది. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార అనుమతుల కోసం సువిధ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకుని వేగంగా అనుమతులు పొంది, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో అన్నివిధాల జిల్లా యంత్రాంగానికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# ఎన్‌బికెఆర్‌లో.. 'ఎస్టాటికా' సంబరాలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల సమాహారం.. ఎస్టాటికా సంబరాలు అంబరాన్నంటేలా జరిగాయి. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని వివరించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో సంక్షోభం నెలకొన్నప్పటికీ ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులు 80 మంది ప్రముఖమైన ఆక్సెంచర్ కంపెనీలో ఉద్యోగాలు సాధించడం విశేషమన్నారు. గత ఏడాదినుంచి తమ కళాశాలలో మ్యూజిక్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వల్ల నృత్యాలు, పాటల్లో కూడా విద్యార్థులు ముందుంటున్నారని ఎస్టాటికా కన్వీనర్ వర్లీబాషా చెప్పారు. విద్యార్థుల తరఫున కన్వీనర్లు వందన, వర్షిత్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కళాశాలలోని అనేక విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# డాక్టర్ మేరిగ రేవంత్ ప్రచారం



గూడూరు పట్టణంలోని 9వ వార్డు గమళ్ళపాలెం అంకమ్మవీధి, మహాలక్ష్మి అమ్మవారి వీధి, మాయా బజారు ప్రాంతాల్లో ఈ నెల 1వ తేదీన వైసీపీ నేతలు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో మమేకమవుతూ ముందుకు సాగారు. గూడూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మేరిగ మురళీధర్ తరపున ఆయన తనయుడు రేవంత్ చక్రవర్తి ప్రచారాన్ని ప్రారంభించారు. గూడూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా బీసీ సెల్ కన్వీనర్ గోపియాదవ్, స్థానిక నాయకులతో కలసి ప్రతి ఇంటికి వెళ్తూ ఓటర్లను వైకాపాకు మద్దతు ఇవ్వాలని, తన తండ్రి మేరిగ మురళీధర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. భవననిర్మాణ కార్మికసంఘ గౌరవాధ్యక్షులు పుట్టా శంకరయ్య తదితరులను కలిసి తన తండ్రిని గెలిపించాలని కోరారు. నాయకులు తాళ్లూరు శ్రీనివాసులు, అన్నం మురళీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపాలి



ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బూదనం, ఓడూరు, పున్నపువారి పాళెం గ్రామాల్లో ఈ నెల 3న ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలువురు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నేతలు ఎస్వీ రమణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, లీలమ్మ, శైలజ, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పారిశ్రామికవేత్త, వైకాపా నేత పొణకా శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఈనెల 1వ తేదీ గూడూరులోని ఆయన నివాసంలో జరిగాయి. శివకుమార్‌రెడ్డి అభిమానులు, పార్టీ నాయకుల సమక్షంలో స్వచ్ఛఆంధ్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మతో కలసి శివకుమార్‌రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి.. ఆర్డీవో కిరణ్‌కుమార్, గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతీ శిశు మందిరం వార్షికోత్సవం




గూడూరు సంయుక్తానగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిరం ఇంగ్లీష్ మీడియం స్కూల్ 39వ వార్షికోత్సవం మార్చి 30వ తేదీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సి.జనార్దన్ రెడ్డి, డాక్టర్ సిద్ధారెడ్డి వినోద్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ డోలు విద్వాంసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వినుకొండ సుబ్రహ్మణ్యంని ఘనంగా సన్మానించారు. స్కూలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల అధ్యక్షులు మురళి రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బండి శ్యామసుందర రావు (మయూరి శ్యామ్ యాదవ్) వార్షిక నివేదికను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్ రావు, శిశు మందిరం ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, ఉపాధ్యాయినులు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# హరికథకు కీర్తి తెచ్చిన.. ఆదిభట్ల

హరికథ అపూర్వమైన కళాప్రక్రియ అని, తన ప్రతిభా పాటవాలతో ఆ కళకు ఆదిభట్ల నారాయణదాసు మరింత కీర్తిని తెచ్చారని విశ్వనాథ సాహిత్య అకాడమీ (గుంటూరు) కార్యదర్శి మోదుగుల రవికృష్ణ అన్నారు. చెన్నై–టీ నగర్‌లోని ఆంధ్రాక్లబ్‌లో వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికగా జరిగిన 147వ కార్యక్రమంలో ఆయన పాల్గొని 'ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం–సాహిత్యం' అనే అంశంపై ఉపన్యసించారు. 'హరికథ' అంటే ఆదిభట్ల అనే రీతిలో, తన అద్భుతమైన హరికథలతో తెలుగు ప్రజల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని, హరికథ కళకు ఎనలేని సేవలు చేసిన మహనీయుడు ఆదిభట్ల అని ఆయన కొనియాడారు. అనంతరం, వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు తదితరులు మోదుగులను ఘనంగా సన్మానించారు.

# మనుబోలులో పట్టపగలే చోరీ

మండల కేంద్రమైన మనుబోలులో మార్చి 31 ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. బీసీ కాలనీలో ఉన్న సుమన్–అనూష దంపతులు ఊరికి వెళ్ళి, మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికే దొంగలు తమ పని కానిచ్చేశారు. లక్ష రూపాయలతో పాటు, 16 గ్రాముల బంగారు వస్తువులను కూడా దొంగిలించుకుపోయారు. బాధితుల ఫిర్యాదుతో మనుబోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# దివ్యాంగులకు శ్రీసిటీ పరిశ్రమ సాయం

## రూ. 15 లక్షల విలువైన వీల్‌ఛైర్లు, ట్రై సైకిళ్ళు పంపిణీ

శ్రీసిటీలోని గృహోపకరణాల తయారీ పరిశ్రమ 'హామిల్టన్ ప్రైవేట్ లిమిటెడ్' వారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) లో భాగంగా, శ్రీసిటీ పరిసర ప్రాంతాలలోని దివ్యాంగులకు ఇటీవల భారీ సాయం అందించారు. రూ. 15లక్షల విలువైన వీల్ ఛైర్లు, ట్రై సైకిళ్ళు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, ఇంకా దివ్యాంగులకు అవసరమైన పలు పరికరాలను 305 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హామిల్టన్ జనరల్ మేనేజర్ జయంత, అధికారులు రాజేష్ గాంధీ, ప్రసన్న, డానెలి వాజ్, లారెన్స్, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్‌కుమార్, వై.రమేష్, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో 'హామిల్టన్' సీఎస్ఆర్ చర్యలను అభినందించారు. దివ్యాంగులకు సాయం అందించే ఈ కార్యక్రమం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# శ్రీసిటీ–మోండెలెజ్ పరిశ్రమ వితరణ

శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డైరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్‌ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఇటీవల సూళ్ళూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 30 లక్షల విలువైన అధునాతన వసతులు కలిగిన కొత్త అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డిఎం&హెచ్ఓ డాక్టర్ శ్రీహరికి మోండెలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్ ఆ అంబులెన్స్ తాళాలనందజేశారు. ఈ వితరణ పట్ల మోండెలెజ్ ఇండియాకు



ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య, షణ్ముగ పొన్నుసామి, ఆ పరిశ్రమకు చెందిన ఉన్నతాధికారులతో పాటు శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.




తెలతెలవారుతున్నది. తూర్పుదిక్కు అప్పుడే విచ్చుకుంటున్నది.

గడ్డిపక్కపైన పట్టుపరుపులమీద పడుకున్నంత హాయిగా రామ లక్ష్మణులు నిదురిస్తూ ఉన్నారు.

వారి ముఖాలను కనురెప్పవాల్చకుండా తనివితీరా చూస్తూ ఉన్నారు మహర్షి!

రాముని ముఖపద్మంలోని సౌందర్యం అనే మధువును గ్రోలే తుమ్మెదలా ఉన్నారాయన! .

ఆయన రాముడికి మేలుకొలుపు పాడుతున్నారు... రామా నిద్దురలే అని!

***కౌసల్యా సుప్రజా రామ పూర్వా సన్ధ్యా ప్రవర్తతే***
***ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యమ్ దైవమాహ్నికమ్!***

కౌసల్యా సుప్రజా... కౌసల్య యొక్క ఉత్తమ సంతానమైన రామా... ఓ రామా

పూర్వా సంధ్యా ప్రవర్తతే... తూరుపు దిక్కున తెలవారబోతున్నది

ఉత్తిష్ఠ... లెమ్ము

నరశార్దూలా.. మానవులలో శ్రేష్ఠమైన వాడా!

కర్తవ్యమ్ దైవ మాహ్నికమ్...ప్రతిదినము చేయవలసిన పనులు చేయాల్సి ఉన్నది.

రామలక్ష్మణులు సంధ్యావందనాది పనులన్నీ చక్కగా ఆచరించి మరల మునివెంట బయలుదేరారు.

అలా నడచినడచి సరయూ, గంగా నదుల సంగమప్రదేశం చేరారు!.

అక్కడ వేల సంవత్సరాల నుండి తపస్సు చేస్తున్న ఎంతోమంది ఋషీశ్వరులగుపించారు. ఆ ప్రదేశాన్ని అంతటిని ఆసక్తిగా చూశారు రామలక్ష్మణులు.

అక్కడ ఒక ఆశ్రమం చూశారు, అది చూడగనే వారి మనస్సులో ఏదో తెలియని ఆనందం ప్రవేశించింది. కుతూహలంతో మహర్షిని ప్రశ్నించారు!

"మహర్షీ ఈ ఆశ్రమం ఎవ్వరిది?".

ఇక్కడ పూర్వం పరమశివుడు తపమాచరించేవాడు!

ఆయనకు అప్పుడే వివాహం జరిగింది. శివుడంతటివాడు వివాహం చేసుకోవటంతో, అది నా వల్లనే జరిగింది అని అహంకరించాడు మన్మథుడు (అప్పుడు మన్మథుడికి శరీరముండేది).

శివుడు ఆతడి అహంకారాన్ని చూసి హుంకరించాడు!

మూడోకన్ను తెరచి మన్మథుని చూశాడు. అప్పుడు మన్మథుడి శరీరంలోని ఒక్కొక్క అంగం కాల్చివేయబడింది!

మన్మథుడు దేహం విడిచిన ప్రదేశం కాబట్టి అంగదేశం అని పేరు వచ్చింది! పరమపావనమైన ఈ ప్రదేశంలో ఈ రాత్రికి ఇక్కడే విశ్రమిద్దాం.

రేపు తెల్లవారగనే గంగను దాటుదాం అని గంగాస్నానం చేసి శుచిగా ఆశ్రమంలో ప్రవేశించారు!

శ్రీరాముని వెంటపెట్టుకొని విశ్వామిత్రుడు వచ్చాడని తెలిసి ఆశ్రమంలోని మునులందరూ సంతోషంతో పులకరించిపోయారు!.

వారికి తగువిధంగా సత్కారాలు చేసి అక్కడ వారు విశ్రమించటానికి కావలసిన ఏర్పాట్లు చేశారు.

ఆ రాత్రి అంతా రాజకుమారులకు మనోహరమైన కథలు చెపుతూ ఆనందింపచేశారు మహర్షి!.

తెలవారగనే స్నానసంధ్యాదులు పూర్తిచేసుకొని ఆశ్రమవాసులు ఏర్పాటు చేసిన నావమీద గంగానది దాటుతున్నారు, గంగ మధ్యలోనికి రావడంతోనే నీరు బద్దలవుతున్నట్లుగా గొప్పశబ్దం వినిపించింది! అదేమిటి? అని ప్రశ్నించాడు రామచంద్రుడు కుతూహలంతో!

అప్పుడు మహర్షి ఇలా చెప్పారు! పూర్వం తన మనస్సులో జనించిన సంకల్పంతో బ్రహ్మదేవుడు కైలాస పర్వత ప్రాంతంలో ఒక సరస్సు నిర్మించాడు, ఆయన మనస్సంకల్పంనుండి పుట్టినది కాబట్టి దానికి మానస సరోవరమనిపేరు.

అక్కడ నుండి సరయూనది జన్మించింది! సరస్సు నుండి ప్రవహిస్తున్నది కావున" సరయూ" అని పేరు వచ్చింది!

ఆ సరయూనది గొప్ప తరంగాలతో గంగాప్రవేశం చేస్తున్నది అప్పుడు పుట్టే జలఘోషనే నీవు వింటున్నది అని చెప్పారు మహర్షి.

గంగ దాటగనే ఏ మాత్రమూ మానవ సంచారం లేని భయంకరమైన ఒక అడవిలోకి ప్రవేశించారు వారు!

ఆ భయంకరమైన, దుర్గమమైన అడవిని చూసి రాముడు విస్మయంతో మహర్షిని ప్రశ్నించాడు!

ఆ అడవిలో కాలుపెట్టే సందులేనంతగా అల్లుకొనిపోయి ఉన్నాయి వృక్షాలు, లతలు. దానికితోడు పురుగులు ఈల వేసుకుంటూ చేసే ధ్వని! అత్యంత కర్ణకఠోరంగా అరిచే వివిధ రకాల జంతువులు, క్రూర మృగాలు, సామాన్యుడి గుండె జలదరించేటట్లున్నదా వనం.

మహర్షిని కుతూహలంతో అడిగాడు! రాముడు! ఏమిటిది? ఈ విధంగా ఎందుకున్నది? అని

రామా, పూర్వం ఇది రెండు దేశాల సముదాయం.

అవి ఒకటి మలదము, రెండు కరూశము.

ఈ రెండు దేశాల ప్రజలు సుఖశాంతులతో, ధనధాన్య సమృద్ధితో హాయిగా జీవనం సాగించేవారు.

మహర్షీ ఈ దేశాల పేర్లు వింతగా ఉన్నవేమిటి? మలదము, కరూశమా? ఆ పేర్లెట్లా వచ్చినవి? అని రాముడు ప్రశ్నించాడు.

రామా! పూర్వము వృత్రాసుర వధ అయిన పిదప ఇంద్రుడికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకున్నది.

ఆయన్ను తీవ్రమైన ఆకలి బాధించింది! శరీరమంతా మలినమై



అసహ్యకరంగా మారిపోయాడు!.

అప్పుడు సకల ముని సంఘాలు, దేవతలు ఆయన శరీర మలాన్ని కడిగివేసి మలాన్ని తొలగించారు, అదేవిధంగా ఆకలిని (కారుశాన్ని కూడా) తొలగించారు.

ఆతని మలాన్ని, ఆకలిని స్వీకరించిన భూమి కావున మలాదము, కరూశము అని పేర్లు ఈ ప్రాంతానికి!

దేవేంద్రుడు సంతోషంతో ఈ ప్రాంత ప్రజలు సుఖంగా ఉండేటట్లు వరమిచ్చాడు!.

కొంతకాలానికి ఒక యక్షిణి, స్వేచ్ఛారూపధారిణి, వేయి ఏనుగుల బలమున్నది, తాటక నామధేయురాలు ఈ ప్రాంతంలో జనులను పీడిస్తూ వారిని భయభ్రాంతులను చేస్తూ స్వేచ్ఛగా సంచరిస్తున్నది.

దాని భర్త సుందుడు, కొడుకు మారీచుడు! కొడుకు కూడా తల్లివలెనే మహాబలవంతుడు. వాడి బారినపడి బాధపడనివాడు లేడు!

తల్లీ కొడుకులంటే ఉన్న భయం చేత ఈ ప్రాంతంలో అడుగు మోపే సాహసం ఎవ్వరూ చేయటంలేదు. మనమున్న ప్రదేశం నుండి ఒకటిన్నర ఆమడల దూరంలో దాని నివాస స్థానం!

రామా! అలాంటి ఘోరతాటకను నీవు వధించాలి! అని విశ్వామిత్రుడు పలికాడు!

రాముడప్పుడు వినయంగా, మహర్షీ యక్షులకు ఇంతటి బలములేదని విన్నాను, ఈవిడకింత బలమెక్కడిది? అని ప్రశ్నించాడు! .

నీవన్నది నిజమే రామా! ఇది సుకేతుడు అనే గొప్ప యక్షునకు బ్రహ్మ వరప్రసాదం వల్ల జన్మించింది. వేయిఏనుగుల బలంపొందింది.

దీని భర్త సుందుడు అగస్త్య మహర్షికి చేసిన అపచారం వల్ల ఆయన శాపానికి గురై మరణించాడు.

అందుకు ఆగ్రహించి తల్లికొడుకులు ఇరువురూ ఆయనను భక్షించబోగా ఇరువురినీ రాక్షసులు కమ్మని శపించాడు!

అప్పటినుండి అది ఈ ప్రదేశాన్ని నాశనంచేస్తూ వస్తున్నది!

ఈ ప్రదేశం ఒకప్పుడు అగస్త్యుడు నివసించిన ప్రాంతం!

రామా! నీవు తప్ప ముల్లోకాలలో దానిని వధింప సమర్థుడు మరెవరూ లేరు.

..(సశేషం)

# రాహుల్ - ప్రహిత

అరబిందో సంస్థల వ్యవస్థాపకులు పెనాక రాంప్రసాద్‌రెడ్డి తమ్ముడు, నెల్లూరుజిల్లా పెయ్యలపాలెం వాస్తవ్యుడు, ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడిన పెనాక గోపినాథ్‌రెడ్డి - శ్రీమతి వరలక్ష్మిల కుమారుడు **రాహుల్ దీపక్‌రెడ్డి - ప్రహిత** (కాండ్ర ప్రసన్నకుమార్‌రెడ్డి - శ్రీమతి ప్రతిమల కుమార్తె)ల పెళ్లి వేడుక మార్చి 24వ తేదీ నెల్లూరులో, రిసెప్షన్ మర్చి 29వ తేదీ హైదరాబాదులో ఘనంగా జరిగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్తగా వరుడి పెదనాన్న రాంప్రసాద్‌రెడ్డి, స్నేహాభిలాషిగా గోపినాథ్‌రెడ్డికీ ఇద్దరికీ మంచి పరిచయాలు, స్నేహసంబంధాలు ఉండడంతో ఈ రెండు వేడుకలలో అనేకమంది ప్రముఖులు రెండు కుటుంబాల బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని రాహుల్ - ప్రహితలని దీవించారు. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.





# మోడీతో జోడీ కలిసొచ్చేనా?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీతో జతకట్టిన టీడీపీ, జనసేనకి ముస్లింలు, క్రిష్టియన్లు ఓట్లేస్తారా..? అన్న ప్రశ్నని విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. హిందూయేతర మతాలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటేస్తాయి, హిందువులంతా బీజేపీకే మద్దతు తెలుపుతారు అనుకుంటే అది రాజకీయ అజ్ఞానం, అవివేకం అవుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. కేవలం మతం కొలమానంగా ప్రజలు ఓట్లు వేస్తే బీజేపీ శాశ్వతంగా ఈ దేశాన్ని పరిపాలిస్తుందన్నది వారి వాదన. 2011 గణాంకాల ప్రకారం భారతదేశంలో 79.8 శాతం హిందువులే ఉన్నారు. మిగిలిన మతాలన్నీ కలిపితే 20.2 శాతమే. ముస్లిములు, క్రిష్టియన్లు భాజపాని వ్యతిరే కించినట్లుగా హిందూ సమాజమంతా ఇతర పార్టీలని బహిష్కరిస్తే ఏమవుతుందో వూహించుకోమంటు న్నారు విశ్లేషకులు. కాబట్టి, రాజకీయ పార్టీల పనితీరు, ప్రజల అభిమానాన్ని బట్టే ఎన్నికల ఫలితాలు ఉంటాయే తప్ప మతాల ప్రాతిపదికన మాత్రం కానే కాదంటున్నారు మేధావులు.

## మోడీ సభ మేలు చేసిందా?

ఆంధ్రాలో జరిగిన ప్రధానమంత్రి సభపై కూడా రాజకీయవర్గాలలో చర్చలు జరుగుతున్నాయి. ఆ సభలో ప్రధాని.. బాబుని పొగడలేదు, జగన్‌ని తిట్ట లేదు... ఎందుకని అన్నది వారి ప్రశ్న. అయితే, ప్రధానమంత్రి సాధారణ స్థాయి నాయకుడు కాదని విజ్ఞత, పరిపక్వత, సమర్థత కలిగిన నేత అని, కాబట్టే... స్థాయిని మరచి ఆయన మాట్లాడలేదని విశ్లేషకులు అంటున్నారు. "జగన్ ప్రభుత్వంలోని మంత్రులంతా అవినీతికి పాల్పడుతున్నారు" అంటూ ప్రధాని చురకలు అంటించారు. అవి పరోక్షంగా ఎవరికి తగిలి వుంటాయో తెలివైన వాళ్ళకెవరికైనా అర్థం అయ్యి ఉంటుందని చెప్తున్నారు. అలాగే "ఈ దేశానికి, మీ రాష్ట్రానికి మేలు జరగాలంటే కూటమికి ఓటెయ్యండి" అని ప్రధాని పిలుపునిచ్చారు. అంతే తప్ప బీజేపీకి ఓటెయ్యండి అని ఎక్కడా చెప్పలేదు. అంటే, ఆంధ్రాలో కూటమి అంటే టీడీపీ – జనసేన పార్టీలే కదా అని విశ్లేషకులు వాదిస్తున్నారు. మోడీ ప్రసంగాన్ని సానుకూలంగా తీసుకుంటే ఆయన ప్రతి మాటలోనూ వైసీపీని ఓడించమన్న అర్థమే స్ఫురిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు. కాబట్టి మోడీ సభ వల్ల కూటమి పార్టీ శ్రేణులెవ్వరు నిరాశ చెందనవసరం లేదని మేధావులు అంటున్నారు.

## సిద్ధం... మేమంతా సిద్ధం ప్రభావమెంత?

ఎన్నికల వేళ ఎవరు డబ్బులిచ్చి, మందు పోసి, బిరియాని పెడితే వాళ్ళ వద్దకి జనం వెళ్లడం సహజం. ఏ పార్టీ అయినా తమ సభలని విజయవంతం చేసుకోవాలంటే పై మూడింటితో ప్రజలని ప్రసన్నం చేసుకోవలసిందే. పార్టీ ఏదైనా, నాయకుడు ఎవరైనా వాపును చూసి బలుపనుకుంటే బొక్క బోర్లా పడాల్సిందే. సినిమా మొదటి భాగం చూసి ఎవరైనా ఆ సినిమా హిట్టా... ఫ్లాపా... అని చెప్పలేరు. శుభం కార్డు పడే సమయంలో జనం ఏమనుకుంటున్నారన్నది ప్రధానం. ఆంధ్రాలో ఇంకా నోటిఫికేషన్ రాలేదు. నామినేషన్ల పర్వం ముగియలేదు. చివరివరకు బరిలో ఉండబోయేదెవరన్న స్పష్టత రాలేదు. ఇప్పటికీ కొంతమంది నాయకులు అటుకులు చిటుకులు మారుతున్నారు. కొన్ని పార్టీల అభ్యర్థులు మారుతున్నారు. ఏప్రిల్ 25వ తేదీ తరువాత అభ్యర్థుల నామినేషన్లు, ఉప సంహరణల ప్రక్రియ ముగిశాక కానీ ఒక స్పష్టత రాదు.

అసలు కథంతా చివరి 18 రోజులలోనే మలుపులు తిరుగుతోందంటున్నాయి రాజకీయవర్గాలు. వారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నామంటున్నారు విశ్లేషకులు. "కర్ర విరగలేదు – పాము చావలేదు" అన్న చందంగా ప్రస్తుత ఆంధ్రా రాజకీయ పరిస్థితులు ఉన్నాయన్నది మాత్రం స్పష్టమవుతోంది!






# 'అయ్యా యస్'లకి స్థానచలనం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతస్థానాల్లో ఉన్నప్పటికీ, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తేనే ఎన్నికల విధుల్లో ఉంటారని, లేకుంటే లేదని ఎన్నికల కమిషన్ హెచ్చరించినట్లయింది.

## ప్రతిపక్షాలపై దాడులు

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పూర్తిస్థాయిలో అధికారపార్టీకి వత్తాసు పలుకుతూ, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల పట్ల అనుచిత చర్యలకు పాల్పడుతున్నారని, కొన్ని చోట్ల వైకాపా నేతల చేతుల్లో అధికారులు కీలుబొమ్మలుగా మారి అక్రమాలకు, అరాచకాలకు కూడా పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంతమంది అధికారుల చర్యలు మరీ ఘోరంగా ఉంటున్నాయంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు నేరుగా ఎన్నికల కమిషన్‌కే ఫిర్యాదులు చేయడం తెలిసిందే.

అధికారం తమ చేతిలో ఉంది కదా అని గతంలో కూడా పలువురు అధికారులు తమ చిత్తం వచ్చినట్లు వ్యవహరించారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడ్డారు. ఈ విషయాల పట్ల కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులందాయి. దీంతో ఆయా అధికారుల తీరుపై మండిపడ్డ కమిషన్, ఉన్నతాధికారుల తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. అందుకు బాధ్యులైనట్లుగా భావిస్తున్న అధికారులు ఎంతటి వారైనా ఎన్నికల కమిషన్ కఠినంగా వ్యవహరించబోతుందనడానికి నిన్నటి బదిలీలు ఉదాహరణ. తిరుపతిలో దొంగ ఓటరుకార్డుల వ్యవహారం వంటివి తమ దృష్టికి రావడంతో, అలాంటి అక్రమ వ్యవహారాలపై లోతుగా విచారించిన ఎన్నికల కమిషన్ ఆమేరకు ఆయా అధికారులపై చర్యలకు ఉపక్రమిస్తూ బదిలీల వేటు వేసింది. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఆ అధికారులకు ఎన్నికలకు సంబంధించి ఎలాంటి విధులూ అప్పగించవద్దని కూడా ఆదేశించింది.

## ప్రధాని భద్రతలోనూ వైఫల్యాలే

సాక్షాత్తూ దేశప్రధాని నరేంద్రమోడీ పాల్గొన్న ప్రజాగళం సభ భద్రతా ఏర్పాట్లను కూడా గాలికొదిలేసి, అత్యంత అలక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా వచ్చాయి. ప్రధాని సభలో భద్రతా వైఫల్యాలకు పోలీసుశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణమంటూ ప్రతిపక్ష నాయకులు ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. ఇలా అనేకసార్లు వచ్చిన ఫిర్యాదులను, ప్రత్యేకించి ఉన్నతాధికారులుగా ఉన్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని అందుకు బాధ్యులైన వారిని గుర్తించి ఎన్నికల సంఘం చర్యలకు దిగడం పట్ల ప్రతిపక్ష పార్టీ వర్గాలలో హర్షం వ్యక్తమవుతోంది. అయితే, ఈ చర్యలు ఇంతటితో ఆగిపోవని, ఇంకా పలువురు ఉన్నతాధికారులపై కూడా వచ్చిన ఫిర్యాదులు విచారణలో ఉన్నాయని, రేపోమాపో మరికొంతమంది 'అయ్యాఎస్' అంటున్న అధికారులపై కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాల సమాచారం.!!!!

# భక్తిశ్రద్ధలతో..గుడ్ ఫ్రైడే



గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని మార్చి 29న జిల్లాలోని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గం సకల మానవాళికి అనుసరణీయమని మతప్రబోధకులు తెలిపారు. నెల్లూరు నగరంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న లోన్‌స్టార్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్, రెవరెండ్ విజయరత్నం, పాస్టర్ ఇమ్మాన్యుయేల్ విజయకుమార్ తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేకప్రార్థనలు జరిపారు. సంతపేట, రైల్వేఫీడర్స్‌రోడ్, కపాడిపాళెంలోని సెయింట్ జోసఫ్స్ ఆర్సీఎం చర్చి, ఫతేఖాన్‌పేటలోని పునీత ఆంథోని చర్చి, చింతారెడ్డిపాళెంలోని ఆర్సీఎం చర్చి తదితర అనేక చర్చిల్లో ప్రార్థనలు చేసి, ఏసుక్రీస్తుపై భక్తిగానాలు ఆలపించారు. విఆర్‌సి సెంటర్‌లోని బాప్టిస్స్ చర్చి డౌనీహాల్‌లో రెవరెండ్ శ్యామ్సన్‌కుమార్ ఆధ్వర్యంలో సప్తవాక్కుల ప్రత్యేక ఆరాధన నిర్వహించి, భక్తి కీర్తనలను ఆలపించారు. సంఘ ఛైర్మెన్ సురేంద్రబాబు, కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



# అపర దానకర్ణుడు.. వేమిరెడ్డి

## • కొనియాడిన టీడీపీ రైతుసంఘం అధ్యక్షుడు

నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అపర దానకర్ణుడని, దాతృత్వానికి ఆయన మారుపేరని, ఆధ్యాత్మిక, సామాజిక సేవాపరాయణుడిగా ఉంటూ జిల్లాలోని ప్రజల అభ్యున్నతికి కోట్లాదిరూపాయల వ్యయంతో ఆయనెన్నో కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకమని టీడీపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల బుచ్చిలోని తన నివాసంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి, కోడలు ఆయిషారెడ్డిలతో కలసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సేవాభూషణుడిగా కీర్తినందుకున్న వేమిరెడ్డిని, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించుకుంటే అటు నెల్లూరు, ఇటు కోవూరు అభివృద్ధికి లోటుండదని, ప్రజలు ఈ విషయాన్ని బాగా ఆలోచించుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీకి విజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు, వేమిరెడ్డి అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంఎస్ఎమ్ఇపై అపోహలొద్దు! చట్టం సులభతరం!!

***సూక్ష్మ, చిన్న, మధ్య తరగతుల పరిశ్రమల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని తీసుకొచ్చిన చట్టం ఎంఎస్ఎమ్ఇ డెవలప్‌మెంట్ చట్టం 2006గా రూపుదిద్దుకొంది. తయారీదారు దగ్గర కొనని వ్యాపారస్తుడికి ఈ చట్టం ఎలాంటి ఇబ్బందీ పెట్టదు. తయారీదారు (సూక్ష్మ, చిన్న తరగతుల వారు) వద్ద కొనుగోలు చేసినవాళ్ళ చెల్లింపుల్లో ఈ చట్టం చక్రం వేసి కూచొంటుంది. దాన్ని గురించి ఓ చిన్న పరిశీలన చేద్దాం. సులభగ్రాహ్యంగా వివరించి అపోహలను తొలగించడమే ఈ వ్యాసం యొక్కం లక్ష్యం.***

ఏ వ్యక్తి కాని, వ్యాపార సంస్థ కాని వస్తువులు లేక సేవలు కనుక పొందినట్లయితే (కొనుగోలుదారులు) అమ్మకందారుకు నగదు ఠంచనుగా చెల్లించాలనేది ఈ చట్టం చెప్తుంది. ఈ చట్ట ప్రకారం అమ్మకందారుకు, కొనుగోలుదారుకు మధ్య ఒప్పందం ఉండాలి. ఆ ఒప్పందం గడవు 45 రోజులు మాత్రమే ఉండాలి. దాని కోసం అమ్మకందారు ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ పొందిన తయారీదారుడు కావాల్సిన అవసరం లాంటి కొన్ని పరిమితులు నిర్దేశించడం ఈ చట్టంలోని కొన్ని సుగుణాలు. అలా ఒప్పంద పత్రం లేకపోతే 'నియమించిన గడువు' ముందుకు వస్తుంది. వస్తువులను లేదా సేవలను అంగీకరించిన రోజు నుంచి 15 రోజుల లోపల నగదు చెల్లించాల్సి రావడమే 'నియమించిన రోజు'గా చట్టం చేసిన ప్రణాళిక.

సూక్ష్మ, చిన్న పరిశ్రమల తయారీదారుకు కొనుగోలుదారుకు మధ్య ఒప్పందపత్రం వ్రాతపూర్వకంగా ఉండాల్సి ఉంటుంది. అలాకానప్పుడు కొనుగోలుదారుడు 15 రోజుల్లోపల నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఉదా॥ శ్రీకర్ ఎంటర్‌ప్రైజెస్ అనే యాజమాన్య సంస్థ, శ్రీకేతన్ కాలేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఫర్నిచరును తయారుచేసి పంపిణీ చేసింది. శ్రీకర్ ఎంటర్‌ప్రైజెస్ ఎంఎస్ఎమ్ఇ క్రింద నమోదు చేసుకొని ఉద్యమ రిజిస్ట్రేషను పొంది ఉంది. వీరిమధ్య ఒప్పందపత్రం ఉంటే శ్రీకేతన్ కాలేజస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 45 రోజుల్లోపల శ్రీకర్ ఎంటర్‌ప్రైజెస్ వారికి నగదు చెల్లించాల్సి ఉంటుంది. అలా ఒప్పందపత్రం లేనిపక్షంలో 15 రోజుల్లోపలే అమ్మకందారైన శ్రీకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు నగదు చెల్లించాలి.

కొనుగోలుదారుడు భారతదేశంలో ఏ ప్రాంతంలోని వారైనా ఈ చట్టం వర్తిస్తుంది. ఇక్కడ మరో విషయం ఉంది. ఒప్పుదలపత్రంలో గడువు ఎక్కువరోజులు వ్రాసుకొన్నప్పటికీ ప్రభుత్వం ఎంఎస్ఎమ్ఇ డెవలప్‌మెంట్ చట్టం 2006 ప్రకారం విధించిన గడువు కేవలం 45 రోజులే. నగదు చెల్లింపులకు అది మాత్రమే వర్తిస్తుంది.

ఇది సూక్ష్మ చిన్న తరగతుల పరిశ్రమల నుంచి కొనుగోలుచేసిన వ్యక్తులకు సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. సూక్ష్మ చిన్న తరగతుల పరిశ్రమలంటే ఏమిటో ఇప్పుడు చూద్దాం.

1) పెట్టుబడి ఒక కోటి రూపాయలు ఉండి 5 కోట్ల అమ్మకాలు సాగిస్తే వాటిని సూక్ష్మ తరహా పరిశ్రమగా నిర్దేశిస్తారు.

2) అదే పెట్టుబడి 10 కోట్ల రూపాయలు లోపల ఉండి అమ్మకం కూడా 50 కోట్ల రూపాయల లోపలైతేనే చిన్న తరగతి పరిశ్రమగా పరిగణిస్తారు. అలాకాకుంటే అవి మీడియం, పెద్ద తరగతి పరిశ్రమలైతే ఎంఎస్ఎమ్ఇ చట్ట పరిధిలోనికి రావు. తయారీ లేకుండా కేవలం అమ్మకం (ట్రేడింగ్) జరిపే వ్యాపారులకు ఈ చట్టాలు వర్తించవు. ఉదా॥ డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర కొన్న వారికి, హోల్‌సేలర్స్ దగ్గర కొన్నవారికి.

కొన్న వస్తువులకు విభాగం (సెక్షన్) 16 ఎంఎస్ఎమ్ఇ చట్టప్రకారం వస్తువులు లేక సేవలు పొందిన ఏ వ్యక్తి అయినా సెక్షన్ 15లో చెప్పిన విధంగా చెల్లింపు జరపని కారణంగా అమ్మకందారునికి 'వడ్డీ' చెల్లించాలనే పెనుభూతం కబళిస్తుంది. వడ్డీ అంటే సాధారణ వడ్డీ కాకుండా చక్రవడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. వడ్డీపై వడ్డీవేసి నడ్డి విరవడమే ఈ సెక్షన్ సారాంశం. వడ్డీ రేటు రిజర్వు బ్యాంకు, బ్యాంకులకు సూచించిన రేటుకు మూడురెట్లు. ఒప్పుదల పత్రంతో సంబంధం లేకుండా వడ్డీని నిర్ణయించిన ఎంఎస్ఎమ్ఇ చట్టం పద్ధతినే పాటించాల్సి ఉంటుంది. ఇక్కడ ఎలాంటి మినహాయింపు ఉండదు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు మూలధన లభ్యత పెరిగి అవి సజీవంగా మనుగడ సాగించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

కొనుగోలుకు చెల్లింపులు జరపడంలో ఆలస్యానికి కట్టే వడ్డీని ఇన్‌కంటాక్స్ లెక్కలో ఖర్చుల క్రింద పరిగణించకపోవడం మరోశాపం. ఇది ప్రభుత్వం స్థిర నిర్ణయాల్లో కరుణచూపని విధానం. ఇందులో ఏర్పడిన వివాదాలకు ఎంఎమ్ఎమ్ఇ ఫెసిలిటేషన్ కౌన్సిలు ద్వారా 90 రోజుల్లో తీర్పును పొందే వీలుంటుంది. ఈ తీర్పును కొనుగోలుదారుడు సవాలు చేయదలచుకొంటే 75 శాతం సొమ్మును కోర్టులో జమచేసి, కోర్టుకు వెళ్ళే అవకాశాన్ని కల్పించారు.

ఈ చట్టం భారతదేశ కొనుగోలుదారులకే కాకుండా విదేశీ కొనుగోలు దారులకు సైతం వర్తిస్తుంది. ఇక్కడ వివాదాల్ని పరిష్కరించడానికీ, చట్టాలు అమలు చేయడానికి దేశ కన్సులేట్లు కీలకపాత్ర పోషిస్తాయి.

## ఇన్‌కంటాక్స్ ఏం చెబుతుంది?

ఇన్‌కంటాక్స్ విభాగం 43బి(బి) మరియు ఎంఎస్ఎమ్ఇ సెక్షన్ కలిపి చదివితేనే మనకు ఈ చట్టం సులభ గ్రాహ్యమవుతుంది.

ఎంఎస్ఎమ్ఇ విభాగం 15 ప్రకారం సూక్ష్మ చిన్న పరిశ్రమలకు, సేవలకు కొనుగోలుదారు అగ్రిమెంటు ప్రకారం 45 రోజులకు లోపల, అగ్రిమెంటు లేకపోతే 15 రోజులకు లోపల చెల్లింపులు జరుపకపోతే కొన్న వస్తువులను, సేవలను కొనుగోలుదారులు ఖర్చు క్రింద పరిగణించే అర్హతను కోల్పోతారు. ఆ తర్వాత బకాయిలు చెల్లించిన సంవత్సరంలో ఖర్చు క్రింద చూపే విధంగా చట్టం చేయబడింది.

గుర్తుపెట్టుకోవాల్సిన అంశాలు

1) ఈ విభాగం కేవలం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకే వర్తిస్తుంది.

2) ట్రేడర్స్‌కు (వర్తకులకు) ఈ విభాగం వర్తించదు.

3) ఎంఎస్ఎమ్ఇలకు చెల్లించే వడ్డీలకు ఇన్‌కంటాక్సు చట్టంలో మినహాయిపు లభించదు.

4) బకాయిలు చెల్లించిన సంవత్సరమే కొనుగోళ్ళను లెక్కలోకి తీసుకోవాల్సిన అగత్యం ఉంది.

ప్రభుత్వాలు వ్యాపారస్తులను ఇలా కడగండ్లపాలు చేయడం అంటే ఈ చట్టమే ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ప్రధానిగా వాజ్‌పేయి కాలంలో ప్రతిపాదించిన ఈ చట్టం ప్రస్తుత పాలకులు ప్రధాని మోదీ నాయకత్వంలో అమలవుతోంది.



**- చిన్ని శ్రావణ్‌కుమార్**
**చార్టర్డ్ అకౌంటెంట్**

# టూకీగా...



## సైదాపురం వద్ద తనిఖీల్లో.. రూ.13 లక్షలు స్వాధీనం

ఎన్నికల నేపథ్యంలో సైదాపురం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకువస్తున్న రూ.13 లక్షలా 2వేల రూపాయలను ఎస్ఐ విజయకుమార్ స్వాధీనం చేసుకుని, సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారమిచ్చారు. ఆ నగదును జిల్లా ట్రెజరీకి అప్పగిస్తామని ఆయన తెలిపారు.

## కావలి సబ్‌జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు

సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ ఆదేశాల మేరకు కావలి సబ్‌జైలులో మార్చి 30న న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కావలి మండల లోక్‌అదాలత్ లీగల్ ఎయిడ్ సభ్యులు ఐ.సాయి ప్రసాద్ పాల్గొని ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ దేవాలయానికి.. రూ.8.37 లక్షల ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఇటీవల హుండీలు లెక్కించగా, 13 వారాల పాటు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 80,37,644 రూపాయలు ఆదాయం వచ్చింది. ఆలయ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది.

## రేబాల అనాథాశ్రమంలో వృద్ధులకు సాయం

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మార్చి 31న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాలలో ఉన్న ఆషాదీప్ ఆశ్రమంలోని వృద్ధులకు క్రీమ్ సంస్థ వ్యవస్థాపకులు ఇజ్రాయిల్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనాథాశ్రమ నిర్వాహకులు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## గణేశ్వరపురం రామాలయానికి రూ.2 లక్షల విరాళం

వరికుంటపాడు మండలంలోని గణేశ్వరపురంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి ఆ గ్రామంలోని వైకాపా నాయకుడు బాదం వెంకటనారాయణరెడ్డి 2 లక్షల రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు మార్చి 31న ఆ విరాళం చెక్కును అందజేశారు.

## ఆత్మకూరులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

రంజాన్ పవిత్రమాసం సందర్భంగా ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఆత్మకూరులోని శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఇఫ్తార్‌విందు ఏర్పాటుచేశారు. స్థానిక పెద్దమసీదులో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 450 మందికి పైగా ముస్లింలు పాల్గొని విందు స్వీకరించారు

## చింతలవాగు వద్ద ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉదయగిరి రూరల్ చింతల గ్రామ సమీపంలో అక్కడి వాగులో నుంచి అక్రమంగా ఉదయగిరి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఇటీవల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి పట్టుకుని, ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతులు లేని ఆ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సెబ్ అధికారులకు అప్పగించారు. ట్రాక్టర్ యజమానికి వారు రూ.10వేలు జరిమానా విధించారు.

## భోగ్యంవారిపల్లి వద్ద ప్రమాదం.. ఇద్దరు మృతి


వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి సెంటర్ వద్ద లారీ డైవర్ సుబ్బరాయుడు(60) లారీ దిగి టైర్లు పరిశీలించుకుంటుంటే, వెనుకనుంచి మరో మినీలారీ వచ్చి ఢీకొంది. సుబ్బరాయుడుతో పాటు మినీలారీ డ్రైవర్ రసపుత్ర ప్రతాప్‌సింగ్ (44) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మరణించాడు. లారీ క్లీనర్ ఫిర్యాదు మేరకు వరికుంటపాడు ఎస్ఐ తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోవూరుపల్లి పీహెచ్‌సీ తనిఖీ

బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఇటీవల డ్రగ్స్ అండ్ డయోగ్నస్టిక్స్ అధికారి ఎం.శ్రీనివాసులు రెడ్డి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఫార్మసీ ల్యాబ్‌ను, ఓపీ విభాగాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఆయన వెంట ఏఏఎస్ఓ రమేష్ తదితరులున్నారు.

## ప్రగతికి వారధి.. సంక్షేమ సారధి

# ఆదాల ప్రభాకరరెడ్డి



## ప్రజా నాయకుడిగా.. ప్రగతి సాధకుడిగా పాతికేళ్ళ ప్రస్థానం

***నెల్లూరుజిల్లా రాజకీయాలలో గడచిన ఇరవై అయిదు సంవత్సరాలుగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, జిల్లా ప్రజల హృదయాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన అరుదైన ప్రజానేత, ప్రస్తుత నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి. వరుసగా మూడు పర్యాయాలు శాసనసభ్యుడిగా గెలిచి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను ప్రగతిపథంలో పరుగులు పెట్టించడంలో నిర్విరామంగా శ్రమిస్తున్న జన నాయకుడు ఆదాల ప్రభాకరరెడ్డి.***

### సేవ వేదికగా వ్యాపారం నుండి రాజకీయాల్లోకి...

ఆదాల ప్రభాకరరెడ్డి స్వతహాగా కాంట్రాక్టర్. నాణ్యమైన నిర్మాణాలతో, క్రమశిక్షణ కలిగిన కాంట్రాక్టర్‌గా ఆ రంగంలో రాణించారు. తరువాతి రోజుల్లో రియల్ ఎస్టేట్ రంగంలో ప్రవేశించి భవన నిర్మాణ రంగంలో తన ప్రతిభని చాటారు. మారుతున్న కాలంతో పాటుగా తన వ్యాపార దృక్పథాన్ని మార్చుకుంటూ ఫార్మాస్యూటికల్ రంగంలో అడుగుపెట్టి ఫైన్ డ్రగ్స్ & కెమికల్స్ సంస్థని, దానికి అనుబంధంగా ఫైన్ ఫ్యాబ్ పరిశ్రమలని స్థాపించారు. వైద్య ఆరోగ్య రంగంలో సేవలందించడమే లక్ష్యంగా తన సోదరుడితో కలిసి మెడినోవా డయాగ్నస్టిక్ సర్వీసెస్‌లో భాగస్వాములయ్యారు. ప్రపంచం మొత్తం ఐటీ రంగం వైపు దృష్టి సారించిన తరుణంలో ఆదాల కూడా రాస్ ఇన్ఫోటెక్ పేరుతో సాఫ్ట్‌వేర్ సంస్థను హైదరాబాదులో నెలకొల్పారు. ఓ వైపు వ్యాపార రంగంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే మరోవైపు సేవారంగం వైపు దృష్టి మరల్చారు.

తన సొంత పేరుమీద 1997లో ఆదాల ప్రభాకరరెడ్డి చారిటబుల్ ట్రస్టును ప్రారంభించి సేవారంగంలో కూడా తన ఉనికిని చాటుకున్నారు. చిన్నప్పుడు తాను చదువుకున్న నార్త్‌మోపూరు బడి మొదలు, తమ ఊరు చుట్టుపక్కల దాదాపు 25 పాఠశాలలకు చేయూతనందించారు. అవసరమైన చోటల్లా మంచినీటి ప్లాంట్‌లను పెట్టించారు. రైతుల బాధలు తెలిసిన రైతుబిడ్డగా రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాలువలు తవ్వించారు. పేదవారికి ఉచిత విద్యను అందించడమే లక్ష్యంగా మారుమూల పల్లెల్లో సైతం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రభాకరరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి విన్న రాజకీయ పార్టీలు ఆయనని తమ పార్టీలోకి రావలసిందిగా ఆహ్వానించాయి. తమ పార్టీ అభ్యర్థిగా అల్లూరు నియోజకవర్గం నుండి పోటీ చేయమని కోరాయి.

అప్పట్లో రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి లేనప్పటికీ అన్నివర్గాల ప్రజలకు, తనకు బాగా ఇష్టమైన వ్యవసాయ రంగానికి సేవలందించడానికి రాజకీయ రంగాన్ని వేదికగా చేసుకున్నారు ఆదాల.

### ప్రజానేతగా అలుపెరుగని ప్రయాణం!

రాజకీయ అరంగేట్రం చేసిన తరువాత 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అల్లూరు శాసనసభ నియోజకవర్గం నుండి ఆయన తొలిసారిగా పోటీ చేసి గెలిచారు. 1999 నుండి 2004 వరకూ అల్లూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడ్డారు. ఆయన జన్మస్థలం నార్త్‌మోపూరు అదే నియోజకవర్గంలో ఉండడంతో జన్మభూమి ఋణం తీర్చుకోవడానికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అదే సమయంలో మంత్రి పదవి కూడా ఆదాలని వరించడంతో తన నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. గ్రామీణ వికాసం కోసం పాటుపడ్డారు. మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల కుటుంబాలలో వెలుగులు నింపారు. ఆదాల అంటే అభివృద్ధి, సంక్షేమాలకి చిరునామా అన్నట్లుగా తన సేవలు అందించారు. మంత్రి హోదాలో తమ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో సైతం మంచి నేతగా గుర్తింపు పొందారు.

దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి అభ్యర్ధన మేరకు 2004 సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గం మారారు. అల్లూరు నుండి సర్వేపల్లికి వచ్చారు. అదే నియోజకవర్గం నుండి వరుసగా రెండు దఫాలు శాసనసభ్యుడిగా గెలిచారు.

### చరిత్రాత్మక అభివృద్ధి!




ముఖ్యంగా 2004-2014 సంవత్సరాల మధ్యకాలంలో ఒక దశాబ్దం పాటు సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడిగా జిల్లాలో చరిత్రాత్మక అభివృద్ధికి ఆదాల ప్రభాకరరెడ్డి శ్రీకారం చుట్టారు. ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో జిల్లావాసుల చిరకాల కలగా మిగిలి పోయి వుండిన కృష్ణపట్నం పోర్టుని ప్రారంభింప జేశారు. సర్వేపల్లికి అంతర్జాతీయ వాణిజ్య విభాగంలో స్థానం దక్కించారు. కృష్ణపట్నం పోర్టుకి అనుసంధానంగా వచ్చిన పరిశ్రమలు, విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు వంటి వాటితో జిల్లా స్వరూపమే మారిపోయింది. ముత్తుకూరు, సర్వేపల్లి, తోటపల్లిగూడూరు తదితర ప్రాంత ప్రజలకి ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వందలాది మందికి ఉద్యోగాలు వచ్చాయి. దిన కూలీల ఉపాధి అవకాశాలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి.

వీటన్నిటితో సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల జీవన సరళి పూర్తిగా మారిపోయింది. మండల కేంద్రాలు, గ్రామాలు కొత్త కళని సంతరించుకున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు కలలో కూడా ఊహించని రీతిలో సర్వేపల్లిని సర్వతోముఖాభివృద్ధి చేసి చూపించారు ఆదాల.

### బహుముఖ ప్రజ్ఞాశాలి!

రైతు బిడ్డగా వ్యవసాయాన్ని ప్రేమిస్తూ, కాంట్రాక్టర్‌గా, పారిశ్రామికవేత్తగా, ప్రజాసేవా పరాయణుడిగా, రాజకీయ నేతగా, కళాభిమానిగా అన్నింటినీమించి ఒక మంచి మానవతావాదిగా అంచెలంచెలుగా ఎదిగి బహుముఖ ప్రజ్ఞాశాలిగా అగ్రగామిగా నిలిచారు ఆదాల ప్రభాకరరెడ్డి.

### పార్లమెంటు సభ్యుడిగా ఎనలేని సేవలు!



2019 సార్వత్రిక ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నికై పార్లమెంటు సభ్యుడిగా ఢిల్లీలో తన వాణి వినిపిస్తున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, రైల్వే మంత్రిత్వశాఖలో కన్సల్‌టేటివ్ కమిటీ సభ్యుడిగా ఆయా విభాగాల్లో తన సేవలందిస్తున్నారు. పార్లమెంటు సభ్యుడిగా అనేక సంక్షేమ కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులను మంజూరు చేయించారు. నెల్లూరు నగరంలో అనేక ప్రాంతాలలో రోడ్లు, కాలువల నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ కోసం 100కోట్ల నిధులు మంజూరు చేయించారు. గత ఏడాది కాలంగా విస్తృత స్థాయిలో స్టేషన్ పనులు జరుగుతున్నాయి. నెల్లూరు నగరం మినీబైపాస్ రోడ్డులో రెండు ఫ్లైఓవర్ల నిర్మాణాలని ఆదాల ప్రతిపాదించి ఆమోదింప చేశారు. ఇప్పటికే రామలింగాపురం కూడలి వద్ద ఒక ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తై ప్రారంభించబడింది. జాతీయ రహదారిపై వేదాయపాళెం, గొలగమూడి కూడళ్ళ వద్ద ఆరులైన్ల ఫ్లైఓవర్‌లని మంజూరు చేయించారు. అత్యంత ప్రమాదకరంగా మారి ప్రజలను దీర్ఘకాలంగా ఇబ్బంది పెడుతున్న ట్రాఫిక్ సమస్యకి పరిష్కారం లభించేలా చేశారు. ప్రస్తుతం ఆ రెండు కూడళ్ళ వద్ద ఫ్లైఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

### రూరల్ నియోజకవర్గంలో పరుగులు పెడుతున్న ప్రగతి!

గత రెండేళ్ళుగా అటు పార్లమెంటు సభ్యుడిగా, ఇటు వైసీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నెల్లూరు నగరంలోని రూరల్ పరిధిలో అనేక సంక్షేమ కార్యక్రమాలకి ఆదాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ రెండేళ్ల కాలంలో రూరల్ నియోజకవర్గంలో ప్రగతిని పరుగులు పెట్టించారు. ప్రస్తుతం రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఆదాల ప్రభాకరరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శాసనసభ రూరల్ అభ్యర్థిగా బరిలో దిగారు. ఆదరించండి – ఆశీర్వదించండి అంటూ... ప్రజల ఆశీస్సుల కోసం రూరల్ ప్రజల ముంగిళ్లలోకి వస్తున్నారు..!!

(ఆదాల నాయకత్వంలో నగరంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల మరిన్ని వివరాలు వచ్చే వారం.)

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com